# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 45 | విశాఖపట్నం | 15-11-2025 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 45 | VISAKHAPATNAM | 15-11-2025 SATURDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-









# సురక్షిత నగరం విశాఖ

# దేశానికి గేట్‌వేలా ఏపీ

- సీఐఐ సదస్సులో సీఎం చంద్రబాబు
- విశాఖలో ఘనంగా ప్రారంభమైన 30వ భాగస్వామ్య సదస్సు
- సదస్సును ప్రారంభించిన ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించిన అదానీ, జీఎంఆర్, బజాజ్, భారత్ ఫోర్జ్
- హాజరైన గవర్నర్, దేశ, విదేశాల ప్రతినిధులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రాష్ట్ర ఆర్థిక రాజధాని అయిన విశాఖలో 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సును ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు, పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని, శ్రీనివాసవర్మ, మంత్రి నారా లోకేశ్, సీఎస్ విజయానంద్, సీఐఐ అధ్యక్షుడు రాజీవ్ మెమానీ, సీఐఐ డైరెక్టర్ చంద్రజిత్ బెనర్జీ, విశిష్ట అతిథులు కరణ్ అదానీ, యూసఫ్ అలీ, బాబా కల్యాణి ఇంక దేశవిదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ వ్యాపార అనుకూల రాష్ట్రంగా ఏపీ నిలిచిందని అన్నారు. రాష్ట్రంలో ప్రశాంతమైన వాతావరణం ఉందని చెప్పారు. దేశంలో పేదరికం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని కార్మిక చట్టాలు, పన్నుల్లో కేంద్రం అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని వివరించారు. మోదీ పాలనలో 11 ఏళ్లుగా దేశం ముందుకెళ్తోందని అలానే సరైన సమయంలో సరైన ఆలోచనే విజయానికి పునాది అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ అనేక ఇబ్బందులు ఎదుర్కొందని అన్నారు. 3 దశాబ్దాలుగా సీఎం చంద్రబాబు తనకు స్నేహితుడని ఉపరాష్ట్రపతి చెప్పారు. ఆయన సారథ్యంలో ఏపీకి అనేక పెట్టుబడులు వచ్చాయని వివరించారు. లక్ష్యం పెట్టుకోవడం సులువు కానీ అక్కడికి చేరుకోవడం కష్టమని అన్నారు. పెట్టుబడిదారులను ఆకర్షించే విషయంలో చంద్రబాబు ముందుంటారని కొనియాడారు. ప్రపంచ నలుమూలల నుంచి వచ్చి రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నారని ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తోనే పెట్టుబడులు వస్తాయని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు.

పెట్టుబడులకు స్వర్గధామంగా విశాఖ మారుతోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. సీఐఐ సదస్సులో ప్రసంగించిన గవర్నర్ క్వాంటమ్ టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్‌కు చిరునామాగా ఏపీ మారిందని అన్నారు. 45 దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులంతా ఏపీలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని గవర్నర్ పిలుపునిచ్చారు.

దేశంలోనే అందమైన నగరంగా విశాఖకు పేరుందని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖను సురక్షితమైన నగరంగా కేంద్రం ఇటీవల ప్రకటించిందని అలానే దేశానికి గేట్‌వేలా ఆంధ్రప్రదేశ్ మారుతోందని చెప్పారు. పెట్టుబడిదారులే లక్ష్యంగా మన రాష్ట్రం ఎదుగుతోందని అన్నారు. ప్రధాని మోదీ పరిపాలనపై దేశ ప్రజలకు విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. 2047లోగా మనదేశం నంబర్ వన్ ఎకానమీ అవుతుందని ఇంకా ప్రజలు, వనరులు, సాంకేతికతను సమర్థంగా వాడుకుంటే తిరుగులేదని సీఎం వెల్లడించారు. ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూసే పరిస్థితి వచ్చిందని సీఎం చంద్రబాబు అన్నారు. పేదరికం, అసమానతలు రూపుమాపేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గ్రీన్‌ఎనర్జీ వినియోగం, స్వర్ణాంధ్ర దిశగా వేగంగా అడుగులు వేస్తున్నామని ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా ఐటీలో మనవాళ్లే ముందుంటున్నారని వ్యాఖ్యానించారు. ఏపీకి స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఎలక్ట్రానిక్స్ సిటీ, క్వాంటమ్ వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ వస్తున్నాయని, ఇంకా సోలార్, విండ్, పంప్డ్ ఎనర్జీలో మన రాష్ట్రమే ముందుందని వెల్లడించారు. ఏపీకి అనేక కంపెనీలు వచ్చి పెట్టుబడులు పెడుతున్నాయని వివరించారు. అలానే అరకు కాఫీని అంతర్జాతీయ స్థాయిలో ప్రోత్సహిస్తున్నామని చంద్రబాబు అన్నారు.

# కలిసి పని చేద్దాం.. పలు సంస్థలకు

# మంత్రి లోకేశ్ విజ్ఞప్తి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ జిలాయ్ సాకి, జేమ్స్ కుక్ యూనివర్సిటీ ప్రతినిధులతో సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ యువత కోసం పర్యావరణ, ఆరోగ్య సంరక్షణ, సస్టైనబుల్ టూరిజం రంగాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి కోరారు. ఫిషింగ్, ఆక్వాకల్చర్, తీరప్రాంత పర్యావరణ వ్యవస్థ నిర్వహణపై మారిటైమ్, తీర ప్రాంత పరిశోధనలకు ఏపీ వర్సిటీలతో కలసి పని చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో ట్రోపికల్ వ్యాధులు, ఆరోగ్య సంరక్షణ, పాండమిక్ ప్రిపేర్డ్‌నెస్‌పై ఏపీ వర్సిటీలతో కలసి ఉమ్మడి పరిశోధనలు చేపట్టాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ లక్ష్యాలకు అనుగుణంగా టెక్నాలజీ, పాలసీ రిసెర్చ్‌కి సహకారం అందించాలని సూచించారు. వ్యవసాయ, పట్టణ నీటి అవసరాలకు జలవనరుల నిర్వహణలో నైపుణ్యం కోసం ఏపీతో కలసి ట్రోఫికల్ వాటర్ రిసెర్చ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. అనంతరం యాక్షన్ టెసా ఎండీ అండ్ సీఈవో వివేక్ జైన్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో సెకండరీ శాటిలైట్, ఎండీఎఫ్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు. ప్రస్తుతం సితార్ గంజ్ తయారీ కేంద్రం 7.5 లక్షల సీబీఎం సామర్థ్యంతో పని చేస్తున్నందున, ఏపీలో సెకండరీ యూనిట్ ఏర్పాటు చేస్తే అదనపు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లకు డిమాండ్ మద్దతు నిస్తుందని చెప్పారు. దిల్లీ ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న తమ సంస్థలో ప్రస్తుతం 2,846 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని సీఈవో వివేక్ జైన్ తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని తెలిపారు. అమెరికాకు చెందిన బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ ఏపీలో రూ.లక్షా 10 వేల కోట్ల పెట్టుబడి పెడుతోందని మంత్రి లోకేశ్ వెల్లడించారు. 17 నెలల్లో ఏపీకి ఇదో మరో భారీ పెట్టుబడని 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. పునరుత్పాదక విద్యుత్, బ్యాటరీ, పంప్డ్ స్టోరేజ్ రంగాల్లో బ్రూక్‌ఫీల్డ్ పెట్టుబడులు పెట్టనుందని వెల్లడించారు. సోలార్ ప్యానెల్ తయారీతో పాటు డేటా సెంటర్లు, కమర్షియల్ రియల్ ఎస్టేట్, జీసీసీలు, ఇన్‌ఫ్రా, పోర్టుల రంగాల్లోనూ ఈ పెట్టుబడులు రానున్నాయని అన్నారు.



2లో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం



## బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం

2లో



## త్వరలో డ్రోన్ టాక్సీలు - కేంద్రం సాయం అందించాలి: చంద్రబాబు

3లో




పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# కనీస వేతన సలహా బోర్డు ఏర్పాటు అవసరం

చట్టాలన్నిటికీ కనీస వేతన చట్టం మాతృక. అంతేకాక కీలకమైనది. సమాన వేతన చట్టమైనా, కార్మిక నష్టపరి హారాల చట్టమైనా, పి.ఎఫ్ చట్టమైనా, ఇ.ఎస్.ఐ చట్టమైనా, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టమైనా, సెలవుల చట్టమైనా, బోనస్ చట్టమైనా గ్రాట్యూటీ చట్టాల ప్రకారంగా ఆర్థికప రమైన లాభాలు ఉంటాయి. కనీస వేతన చట్టం మెరుగుగా లేనిదే మిగతా చట్టాలు అంత ఉపయోగకరంగా ఉండవు. అందుకే కార్మిక వర్గం దీనిపైన కేంద్రీకరించాలి. రాజ్యాం గానికి లోబడి చట్టాలు తయారు చేయాలి. అలా లేని చట్టా లు చెల్లవు. చట్టాలకు లోబడి జీవోలు ( ప్రభుత్వ ఉత్తర్వులు) ఉండాలి. ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి సర్క్యులర్లు ఉండాలి. ఈ క్రమంలో దేనిని ఉల్లంఘించినా అటువంటి వాటిపై న్యాయపరంగా వెళ్ళవచ్చు. షెడ్యూల్ ఎంప్లారుమెంట్ వేత నాలు 2006-2007లో మాత్రమే సవరించబడ్డాయి. చట్ట ప్రకారం అప్పటి ధరలు ఆధారంగా బ్రెట్టా కాస్ కేసులో సుప్రీంకోర్టు తీర్పులో భాగంగాను, 15వ లేబర్ కాన్ఫరెన్స్ సూచనల వెలుగులో, డాక్టర్ ఆక్ట్రాయిడ్ ఫార్ములా ప్రకారం బేసిక్ వేతనంలో కరువు భత్యాన్ని విలీనం చేసి, వెయిటేజి ఇచ్చి, 5 సంవత్సరాలకు ఒకసారి సవరించాలి. ఇప్పటికీ 3 దఫాలు పెంచాల్సి ఉంది. అయినా సవరించలేదు. కాంట్రాక్ట్ లేబర్ వేతనాలు 2012లో సవరించినవి. ఇప్పటికే 2 సార్లు పెంచాల్సి ఉంది. ఈ మేరకు కార్మికులు లక్షల రూపాయలు నష్టపోయారు. బోనస్ చెల్లింపులో, గ్రాట్యూటీ చెల్లింపులో, నష్టపరిహారం చెల్లింపులో, ఓటీ చెల్లింపులో, పి.ఎఫ్, ఇఎస్ఐ చందాలు, పెన్షన్లు చెల్లింపులో, సమాన వేతనం చెల్లింపులో, లీవు పేమెంట్ చెల్లింపులో కార్మికులు లక్షల రూపాయలు నష్టపోయారు. ఆ మేరకు యజమానులు వేల కోట్లు లబ్ధి పొందారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 5 సంవత్సరాలకు ఒకసారి పే రివిజన్ కమిషన్ల ద్వారా వేతనాలను అప్పటి ధరలకు అనుగుణంగా బేసిక్‌లో కరువు భత్యాన్ని విలీనం చేసి, ఫిట్మెంట్ ఇచ్చి, ఫిక్సేషన్ చేస్తుంటారు. మరి ఈ అసంఘటిత కార్మికుల విషయంలో ఈ "వివక్షత" ఎందుకు? ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇష్టా రాజ్యంగా తమ వేదికలలో బిల్లు పెట్టి క్షణాల్లో వేతనాలు, అలవెన్సుల రూపేణా లక్షల రూపాయలను పెంచుకుం టున్నారు. ఇది ఏ రకంగా న్యాయం? దీనికి ప్రాతిపదిక ఏమిటి? ఆ ప్రాతిపదిక కార్మికుల వేతనాలు పెంపుదలలో ఎందుకు ఉండటం లేదు? బియ్యం, పప్పులు, నూనె వంటి అన్ని నిత్యవసర సరుకుల ధరలు అందరికీ ఒకటే కదా? కానీ వేతనాలను నిర్ణయించడంలో అసంఘటిత కార్మికులకు, సంఘటిత కార్మికులకు తేడా ఎందుకు? ఈ వివక్షత రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు అనేకసార్లు వేతనాల నిర్ణయానికి సంబంధించి హెచ్చరించింది. ప్రపంచీకరణ, సరళీకరణ, ఉద్యోగాల కల్పనకు పెట్టుబడులకు ఆహ్వానం, అభివృద్ధి పేర్లతో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, బదిలీ, క్యాజువల్, డైలీ వేజ్, ఎన్.ఎం.ఆర్. ఇలా అనేక రకాల పేర్లు పెట్టి, దోపిడీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని, ఇటువంటి జిమ్మిక్కులు ఆపాలని రాజ్యాంగ అధికరణాలను పేర్కొంటూ "సమాన పనికి సమాన వేతనాలు" చెల్లించాలని సుప్రీంకోర్టు ఎన్ని తీర్పులు చెప్పినా ప్రభుత్వాలకు పట్టవా? ఈ తీర్పులన్నా, చట్టాలన్నా ప్రభుత్వాలకు గౌరవం లేదా? పాలకులు సమాధానం చెప్పాలి. కార్మికులు, కార్మిక సంఘాలు ప్రశ్నించాలి. దేశమంటే మట్టి కాదోరు. దేశమంటే మను షులోరు. తిండి గలిగితే కండగలదోరు. కండగలవాడేను మనిషోయి. మంచి వేతనాలు ఉంటే మంచి పౌష్టికాహారం తింటే శక్తి వస్తుంది. శక్తి వస్తే ఉత్పత్తి పెరుగుతుంది. ఉత్పత్తి పెరిగితే సంపదలు పెరుగు తాయి. సంపదలు పెరిగితే దేశం అభివృద్ధి అవుతుంది. దేశం అభివృద్ధి అయితే ప్రపంచంలో దేశానికి గౌరవం పెరుగుతుంది. అదే వేతనాలు తక్కువ ఉంటే పౌష్టికాహారం తినలేరు. శక్తి తగ్గుతుంది. ఉత్పత్తి తగ్గుతుంది. సంపదలు తగ్గుతాయి. దేశం అభివృద్ధి కాదు. గతంలో పెట్టుబడిదారులు, బడా వ్యాపారవేత్తలు తమ ప్రతినిధులను చట్టసభలకు పంపించేవారు. కానీ ఇప్పుడు తామే చట్టసభలకు కోట్లాది డబ్బు ఖర్చు పెట్టి వెళుతున్నారు. తమకు అనుకూలంగా చట్టాలను మార్చుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ 4 లేబర్ కోడ్‌లుగా పార్లమెంటులో బిల్లును బిజెపి ప్రవేశ పెడితే టిడిపి, వైసిపి పార్టీలు కార్మికులకు వ్యతిరేకంగా మద్దతు తెలిపాయి. ఇదీ వీరి నిర్వాకం. 'మేం పెట్టుబడిదారులకు అనుకూలంగానే చట్టాలు మార్చాము. విలువైన వనరులున్నాయి. భూమి, నీరు, విద్యుత్తు వంటి రాయితీలు ఇస్తాము. మా రాష్టానికి రండి' అని ఈ మధ్య మంత్రి లోకేష్ డొంకతిరుగుడు లేకుండా చెప్పేశారు.కనీస వేతన చట్టం-1948, సెక్షన్-5 ప్రకారం కనీస వేతన సలహా బోర్డును వెయ్యాలి. సెక్షన్-4 ప్రకారం వి.డి.ఏ తో కూడిన కనీస వేతనం నిర్ణయించాలి. కాంట్రాక్టు లేబర్ (ఆర్ అండ్ ఏ) చట్టం-1970, సెక్షన్-10 ప్రకారం పర్మినెంట్ ఉద్యోగులు చేస్తున్న శాశ్వత స్వభావం కలిగిన పనులలో, ఉత్పత్తి విభాగాలలో కాంటాక్ట్ కార్మికులను నియమించడం నిషేధం. అటువంటి చోట సెక్షన్-10(1) ప్రకారం కాంట్రాక్టు విధానాన్ని రద్దుపరిచి రెగ్యులరైజ్ చేయాలని పేర్కొన్నది. కాంట్రాక్టు లేబర్ చట్టం సెక్షన్-25 (ఏ) ప్రకారం పర్మినెంట్ ఉద్యోగి చేస్తున్న అదే పనులనే కాంట్రాక్టు కార్మికులు నిర్వర్తిస్తుంటే యజమాని నియమించిన ఉద్యోగి పొందుతున్న వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని అన్నది. ఇదే చట్టం ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 6, క్లాజ్ నెంబరు కూడా ఇదే అంశాన్ని పేర్కొంది.

# ఏపిలో ఏరోస్పేస్, ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ కేంద్రాలు : కె.రామ్మోహన్ నాయుడు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఏరోస్పేస్, ఎయిర్ క్రాఫ్ట్ తయారీ కేంద్రాలను ఏపికి తీసుకువస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం విశాఖపట్నంలో నిర్వహించిన సిఐఐ భాగస్వామ్య సదస్సులో పలువురు పాల్గని ప్రసంగించారు. కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. గత కొన్ని నెలలుగా ఏపీలో కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పోర్టులు, ఎయిర్ పోర్టులు నిర్మాణం అవుతున్నాయని అన్నారు. ప్రస్తుతం 7 ఆపరేషన్ ఎయిర్ పోర్టులు ఉంటే కొత్తగా మరో 7 ఎయిర్ పోర్టులు నిర్మాణం చేస్తామని అన్నారు.దేశానికి గ్రోత్ ఇంజన్‌గా ఏపీ, ఏపీకి గ్రోత్ కారిడార్‌గా విశాఖ తయారవుతున్నాయని ఏపి ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అమరావతి నిర్మాణం, విశాఖ అభివఅద్ధిని సిఎం వేగంగా చేపడుతున్నారని అన్నారు. 2.4 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఆంధ్రప్రదేశ్ అభివఅద్ధి చెందడానికి కేంద్ర మంత్రి పీయుష్ గోయెల్ సహకరిస్తున్నారని అన్నారు. ఏపీకి వచ్చే పెట్టుబడులకు అనుమతులు, భూములు కేటాయించి త్వరితగతిన ఉత్పత్తి దశకు చేరుకునేలా చేయూత ఇస్తున్నామని అన్నారు. ఇది ఏపీ పారిశ్రామిక దశాబ్దమని ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ఏపీలో సీబీఎన్ బ్రాండ్‌తో ప్రగతి పరుగులు పెడుతోందని అన్నారు. వన్ మిషన్, వన్ విజన్ అనే విధానంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని అన్నారు. వివిధ రంగాల్లోని పెట్టుబడులకు నమ్మకమైన భాగస్వామిగా ఆంధ్రప్రదేశ్ ఉందని అన్నారు. పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటుతో పాటు%ఔ% అతిపెద్ద మార్కెట్‌కు పారిశ్రామికవేత్తలను, కంపెనీలను రాష్ట్ర ప్రభుత్వం చేరువ చేస్తోందని అన్నారు. 550 పారిశ్రామిక పార్కులు ఏపీలో పెట్టుబడుల కోసం సిద్ధంగా ఉన్నాయని అన్నారు.

# "కర్మ హిట్స్ బ్యాక్"... జూబ్లీహిల్స్ ఫలితాల నేపథ్యంలో కవిత ఆసక్తికర ట్వీట్



**హైదరాబాద్, పతాకం న్యూస్:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. "కర్మ హిట్స్ బ్యాక్" అంటూ ఆమె 'ఎక్స్' వేదికగా చేసిన ఈ ట్వీట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఎవరి పేరును గానీ, ఏ పార్టీ పేరును గానీ, ఏ అంశాన్ని గానీ ప్రస్తావించకుండా ఆమె కేవలం మూడు పదాల్లో ట్వీట్ చేయడం గమనార్హం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు వెలువడిన తరుణంలో ఆమె ఈ ట్వీట్ చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ సుమారు 24 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. బీఆర్ఎస్ ఓటమి నేపథ్యంలోనే కవిత ఈ ట్వీట్ చేశారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

# నర్సీపట్నంలో ఘనంగా టిడిపి కమిటీల ప్రమాణ స్వీకారం



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** తెలుగుదేశం పార్టీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం నర్సీపట్నంలో అంగరంగ వైభవంగా జరిగింది. నియోజకవర్గంలోని మండల, గ్రామ, క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయిల కమిటీల నుంచి కలిపి సుమారు 1,800 మంది నాయకులు, కార్యకర్తలు ప్రమాణ స్వీకారం చేశారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడిగా చింతకాయల రాజేష్, కార్యదర్శిగా లాలం మురళీకృష్ణ బాధ్యతలు చేపట్టగా, నర్సీపట్నం మండలానికి సుకల అప్పలనాయుడు, మాకవరపాలెం మండలానికి ఆర్‌వై పాత్రుడు, నాతవరానికి నందిపల్లి వెంకటరమణ, గొలుగొండకు తారక వేణుగోపాల్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మరియు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, జిల్లా జనరల్ కార్యదర్శి లాలం కాశీనాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా బత్తుల తాతయ్య బాబు మాట్లాడుతూ, కార్యకర్తగా కష్టపడి పనిచేసేవారికి పార్టీ తప్పకుండా గుర్తింపు ఇస్తుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఆయన అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ ఆధ్వర్యంలోని అభివృద్ధి పరిపాలన కొనసాగితే రాష్ట్రం మరింత ముందుకు దూసుకెళ్తుందన్నారు. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు చూపిన ఆదరణ జీవితాంతం మరచిపోలేనిదని తెలిపారు. గత ప్రభుత్వ ఒత్తిడుల్లో అయ్యన్నపాత్రుడుకి అండగా నిలిచిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అయ్యన్న ఏ తప్పు జరిగినా నేరుగా చెప్పగల నిజాయితీగల నాయకుడని, నియోజకవర్గ భవిష్యత్ నాయకుడిగా విజయ్ ఎదుగుతున్నారని పేర్కొన్నారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ, పార్టీ పదవులు రాకపోయినా నిబద్ధతతో పనిచేస్తున్న కార్యకర్తలను ప్రశంసించారు. గతంలో సీటు రాకపోయినా పార్టీకి వ్యతిరేకంగా నడచిన దాఖలాలు లేవని గుర్తుచేశారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో

# కాంగ్రెస్ ఘన విజయం



**హైదరాబాద్, పతాకం న్యూస్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ జయకేతనం ఎగురవేశారు. తన సమీప ప్రత్యర్థి, బిఆర్ఎస్ అభ్యర్థిపై 25 వేల ఓట్లకుపైగా మెజార్టీతో ఆయన గెలుపొందారు. నవీన్ యాదవ్ విజయాన్ని ఈసీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఓట్ల లెక్కింపు తొలి రౌండ్ నుంచే నవీన్ యాదవ్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించారు. రౌండ్ రౌండ్‌కూ అది మరింత పెరిగింది. ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత రెండో స్థానంలో నిలిచారు. ఇక, మూడో స్థానంలో ఉన్న బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమైన సమయం నుంచి నవీన్ యాదవ్ ముందంజలోనే కొనసాగడం విశేషం. కాంగ్రెస్ శ్రేణుల్లో సంబరాలు మొదలయ్యాయి.

# కలపాక పంచాయతీ అభివృద్ధిలో ఎన్టిపిసి సిఎస్ఆర్ పాత్ర కీలకం: కనకారావు



**గాజువాక, పతాకం న్యూస్:** కలపాక పంచాయతీ అభివృద్ధిలో ఎన్టిపిసి సింహాద్రి సిఎస్ఆర్ పాత్ర ఎంతో కీలకమని సర్పంచ్ బొండా కనకారావు అన్నారు. ఈ మేరకు సిఎస్సార్ నిధులతో పంచాయితీలో పలు అభివృద్ధి నిర్మాణ పనులకు సర్పంచ్ కనకరావు శంకుస్థాపనలు చేశారు.అభివృద్ధి పనుల్లో భాగంగా సి ఎస్ ఆర్ నిధులు రూ. 10 లక్షలు,మండల గ్రాంట్ రూ. 5 లక్షలతో స్థానిక శివాలయం కు సిసి రోడ్డు, సిఎస్ఆర్ నిధులు రూ. 25 లక్షలతో స్వయంవరం గ్రామానికి డ్రైనేజీ,రూ.14 లక్షలు సిఎస్ఆర్ నిధులతో స్మశాన వాటికకు భారీ గోడ, షెడ్డు,బోర్ నిర్మాణాలు దాదాపు పూర్తి కావస్తున్నాయని,రూ.8 లక్షలు సీఎస్ఆర్ నిధులతో మరిసవానిపాలెంలో సిసి రోడ్డు,కలపాకలో సీసీ రోడ్డు నిర్మాణాలు 4 నెలల కిందటే పూర్తయ్యాయని తెలిపారు. జగనన్న కాలనీలో మండల గ్రాంట్ నుంచి ఒక బోరు, పంచాయతీ నిధులతో మరొక బోరు,మూల స్వయంవరం, పెద్ద స్వయంవరం స్మశానవాటికల్లో మండల గ్రాంట్ తో 2 బోర్లు ఏర్పాటు చేశామన్నారు.అలాగే స్వయంవరం రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణానికి మంజూరైన సి ఎస్ ఆర్ నిధులు రూ. 18 లక్షలకు టెండర్ పూర్తయిందని త్వరలో పనులు ప్రారంభిస్తామని సర్పంచ్ కనకారావు తెలిపారు. ముఖ్యంగా కలపాక పంచాయతీ అభివృద్ధిలో ఎన్టిపిసి సిఎస్ఆర్ సేవలను ప్రశంసిస్తూ సిఎస్ఆర్ యాజమాన్యానికి పంచాయతీ ప్రజల తరఫున సర్పంచ్ కనకారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే మండల గ్రాంట్ తో సహకరించిన ఎంపీపీ పైలా వెంకట పద్మ లక్ష్మి శ్రీనివాస్ కు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం

**బీహార్:** బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తదితరులు 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాష్ట్ర ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారని ప్రధానమంత్రి మోదీ పేర్కొన్నారు. బీహార్‌లో సుపరిపాలన, అభివృద్ధి గెలిపించాయని అన్నారు. బీహార్ అభివృద్ధికి నూతన సంకల్పంతో పని చేసేందుకు ఈ చారిత్రక విజయం మరింత శక్తినిస్తుందని అన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ తన సందేశాన్ని పంచుకున్నారు. "సుపరిపాలన విజయం సాధించింది. అభివృద్ధి విజయం సాధించింది. ప్రజా సంక్షేమ స్ఫూర్తి విజయం సాధించింది. సామాజిక న్యాయం విజయం సాధించింది" అని ఆయన పేర్కొన్నారు. "రాబోయే కాలంలో బీహార్ అభివృద్ధి కోసం మరింత చురుకుగా పనిచేస్తాం. రాష్ట్ర మౌలిక సదుపాయాలకు, సంస్కృతికి కొత్త గుర్తింపును అందిస్తాం. ఇక్కడి యువ శక్తి, మహిళా శక్తికి ఉజ్వల భవిష్యత్తు కోసం తగిన అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇస్తున్నాను" అని మోదీ తెలిపారు. ఎన్డీయేకు ఈ చారిత్రక విజయాన్ని అందించిన బీహార్ ప్రజలకు ప్రధాని మోదీ ప్రగాఢ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రజా తీర్పు, ప్రజలకు సేవ చేయడానికి, బీహార్ కోసం కొత్త సంకల్పంతో పనిచేయడానికి తమకు మరింత శక్తినిస్తుందని అన్నారు. ఈ విజయం వెనుక ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కృషి ఎంతో ఉందని ప్రశంసించారు. "ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ జీకి, ఎన్డీయే కుటుంబ సహచరులైన చిరాగ్ పాశ్వాన్ జీ, జితన్ రామ్ మాంఝీ జీ, ఉపేంద్ర కుష్వాహా జీలకు ఈ అద్భుత విజయానికి నా హృదయపూర్వక అభినందనలు" అని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, ప్రతిపక్షాలు ప్రచారం చేసిన ప్రతీ అబద్ధాన్ని గట్టిగా తిప్పికొడుతూ, తమ అభివృద్ధి అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లిన ఎన్డీయే కార్యకర్తల అవిశ్రాంత శ్రమ వల్లే ఈ విజయం సాధ్యమైందని మోదీ అన్నారు. ప్రతి కార్యకర్తను హృదయపూర్వకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఇక, వికసిత్ భారత్‌పై విశ్వాసం పెట్టుకున్న ప్రతి ఒక్కరి విజయమిదని అమిత్ షా పేర్కొన్నారు. జంగల్ రాజ్, బుజ్జగింపు రాజకీయాలు చేసేవారు ఏ వేషంలో వచ్చినా వారికి దోచుకునే అవకాశం లభించదని పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల్లో ప్రజలు ఎన్డీయే కూటమికి చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. అపూర్వ విజయం సాధించిన నేపథ్యంలో ఆయన మోదీ, నితీశ్ తదితరులకు అభినందనలు తెలియజేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ సారథ్యంలోనే బీహార్‌లో సుపరిపాలన, అభివృద్ధి కొనసాగుతుందని అన్నారు. మోదీ, నితీశ్ ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ విధానాలపై ప్రజల నమ్మకానికి ఈ విజయం నిదర్శనమని జేపీ నడ్డా పేర్కొన్నారు. జంగల్ రాజ్, అవినీతిని రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టారని అన్నారు.

# ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ బాలల దినోత్సవం




చోడవరం, పతాకం న్యూస్: జాతీయ మానవ హక్కుల మండలి ఆధ్వర్యములో ద్వారకా నగర్ ప్రభుత్వ ప్రాథమిక స్కూల్ పిల్లలకు పెన్నులు, పెన్సిల్స్, రబ్బర్లు, బిస్కట్స్, చాకొలేట్స్ శుక్రవారం పంపిణి చేశారు.

చోడవరం ఎన్ హెచ్ ఆర్ సి ప్రాంతీయ కార్యాలయములో జాతీయ ఛైర్మన్ డాక్టర్ పి సంపత్ కుమార్ వారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వాహించామని ఎన్ హెచ్ ఆర్ సి ప్రాంతీయ ఛైర్మన్ దేవరపల్లి నవకుమార్ తెలిపారు.-

35 మంది బాలబాలికలకు పంపిణీ చేశామన్నారు. ప్రధానోపాధ్యా యురాలు వెంకట లక్ష్మి, ఉపాధ్యాయులు ఈశ్వరరావు ఈ కార్యక్రమానికి అతిధిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి పురస్కరించుకొని బాలలదినోత్సవ కార్యక్రమం జరుపుకోవడం చాలా ఆనందాయకం అని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర, జిల్లా, ప్రాంతీయ ఛైర్మన్లు వైస్ ఛైర్మన్లు కార్యదర్శి కోఆర్డినేటర్లు కన్వీనర్లు దేవరపల్లి నవకుమార్,ఆషా, ఫణి జ్యోతి, జోగా తరుణ్, నాగేష్, నాగేశ్వరరావు, అనిల్ కుమార్, పి.అబ్రహం, మణికంఠ, శివకుమార్, పైడి నాయుడు, చిట్టిబాబు కావ్య ఆరాధ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో భారీ పెట్టుబడులకు రిలయెన్స్ గ్రీన్ సిగ్నల్...
# చంద్రబాబుతో భేటీలో కీలక నిర్ణయం



విశాఖపట్నం, పతాకం న్యూస్: ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు రిలయెన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చింది. విశాఖ నగరంలో సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో రిలయెన్స్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్, సోలార్ పవర్ ప్లాంట్, గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. రిలయెన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంఎస్ ప్రసాద్, ఆర్ఐఎల్ సౌతిండియా మెంటార్ మాధవరావు ముఖ్యమంత్రితో భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడులపై కీలక అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా 1 గిగావాట్ సామర్థ్యంతో ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన ప్రాసెసర్‌లతో కూడిన ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రిలయెన్స్ ఏఐ డేటా సెంటర్‌కు అనుబంధంగా ఏపీలో ఈ సెంటర్ పనిచేస్తుంది. ఈ రెండు కేంద్రాలతో ఆసియాలోనే అత్యంత బలమైన ఏఐ నెట్‌వర్క్‌లలో ఒకటిగా రిలయెన్స్ అవతరించనుంది. ఈ ఏఐ డేటా సెంటర్ విద్యుత్ అవసరాల కోసం ప్రత్యేకంగా 6 గిగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును కూడా రిలయెన్స్ నిర్మించనుంది. దీంతో పాటు కర్నూలులో 170 ఎకరాల్లో ప్రపంచ స్థాయి ఆటోమేటెడ్ సౌకర్యాలతో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్క్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్రంపై నమ్మకంతో భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన రిలయెన్స్ అధినేత ముఖేశ్ అంబానీకి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# 'గ్లోబల్ ట్రేడ్ వే' గా విశాఖ
## కేంద్ర మంత్రి పీయూష్ గోయల్




విశాఖపట్నం, పతాకం న్యూస్: గ్లోబల్ ట్రేడ్ గేట్ వేగా విశాఖ నిలుస్తోందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఎపి ప్రభుత్వం నిర్వహిస్తున్న సిఐఐ భాగస్వామ్య సదస్సు విశాఖ పట్నంలో శుక్రవారం ప్రారంభమైంది. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ , గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సదస్సును ప్రారంభించారు. 522 మంది విదేశీ ప్రతినిధులు, 72 దేశాల నుంచి ప్రతినిధులు, 2,500 మంది పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్, రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. గ్లోబల్ ట్రేడ్ గేట్ వేగా విశాఖ నిలుస్తోందని.. స్టీల్ ఉత్పత్తి, ఆక్వా రంగాల్లో ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందిందని అన్నారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌తో ఏపీ సాంకేతికంగా, ఆర్థికంగా బలోపేతం అవుతుందని అన్నారు. 2047 నాటికి సుసంపన్నమైన దేశంగా భారత్ అవతరిస్తుందని, టెక్నాలజీ ద్వారా ఈ సుసంపన్నతను సాధిస్తామని అన్నారు. టెక్నాలజీ డెమొక్రటైజేషన్ అనే విధానాన్ని పాటిస్తూ అందరికీ దానిని చేరువ చేస్తున్నామని అన్నారు. 30 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులతో సెమీ కండక్టర్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ఆ దిశగా పనిచేస్తున్నామని అన్నారు. సీఐఐ సదస్సులతో సరికొత్త పెట్టుబడులు, ఆలోచనలు, ఆవిష్కరణలు రావటం అభినందనీయమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. భారత్‌లో పెట్టుబడులకు గేట్ వేగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తోందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించటంలో భారత్ ఇప్పుడు అగ్రగామిగా ఉందని అన్నారు. పది సూత్రాల ఆధారంగా దేశంలో పెట్టుబడులకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఐటీ కంపెనీలను భారతీయులే నడిపిస్తున్నారని చెప్పారు. డ్రోన్, ఎలక్ట్రానిక్, ఏరోస్పేస్, స్పేస్, సెమీ కండక్టర్స్, డిఫెన్స్ కారిడార్లను ఏర్పాటు చేసి రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని, త్వరలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వచ్చే రెండేళ్లలో క్వాంటం కంప్యూటర్లకు అవసరమైన పరికరాలను కూడా ఉత్పత్తి చేసేలా ప్రయత్నం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పాదన లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. ఆర్థిక వ్యవస్థలను నిర్మించటంతో పాటు సంపద సృష్టించడంలో కలసి పనిచేద్దామని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్గానిక్ ఉత్పత్తులు, పర్యాటకం ఇలా వేర్వేరు రంగాల్లో అపారమైన అవకాశాలను వినియోగించుకోవాలని పారిశ్రామికవేత్తలను కోరారు. పెట్టుబడులకు అనుకూలమైన 25 పాలసీలు రాష్ట్రంలో అమల్లో ఉన్నాయని, అవసరమైన సంస్కరణలు కూడా తెచ్చామని అన్నారు. పరిశ్రమలకు ఇచ్చే ప్రోత్సాహకాల కోసం ఏపీలో ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేస్తామని ప్రకటిస్తున్నామని, సావరిన్ గ్యారంటీని కూడా ఇస్తామని అన్నారు. 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు వరుసగా 8వ సారి ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇస్తోందని ఎపి ఎపి గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. దేశవిదేశాలకు చెందిన ప్రతినిధులు హాజరైన ఈ సదస్సు ప్రపంచ వాణిజ్యాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ సదస్సు ద్వారా ప్రతీ ఆలోచనా, ప్రతీ పెట్టుబడి భవిష్యత్ తరాలకు సంపదగా మారాలని కోరుతున్నామని అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా హైదరాబాద్ మాదిరిగా ఏపీని అభివృద్ధి చేయడానికి యత్నిస్తున్నారని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. దేశం, రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి పనిచేస్తున్నాయని అన్నారు. విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడుల సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

# బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ జయంతి వేడుకలు



గాజువాక, పతాకం న్యూస్: జీవీఎంసీ 87 వార్డు పరిధిలో గల కణితి కళింగ వీధిలో డాల్ ప్లేస్ స్కూల్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకొని డాలి ప్లే పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు మాధురి మరియు శిరీష సుధా పిల్లల మధ్యలో బాలల దినోత్సవం మరియు నెహ్రూ జయంతి వేడుకలు పిల్లల కేరింతల మధ్య జరిగాయి. కేక్ కట్ చేసి, చాక్లేట్లు పిల్లలకి పంచి నెహ్రూ చేసిన మంచి పనులు పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# త్వరలో డ్రోన్ టాక్సీలు - కేంద్రం సాయం అందించాలి: సీఎం చంద్రబాబు




విశాఖపట్నం, పతాకం న్యూస్: డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వాణిజ్య–పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ విశాఖ ముంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేసారు. రాష్ట్రంలో రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల శంకుస్థాపనలకు సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికైంది. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీని తీర్చిదిద్దుతున్నామని సీఎం అన్నారు. ఫస్ట్ మూవర్స్ అడ్వాంటేజ్‌ని తామెప్పుడూ అందిపుచ్చుకుంటేనే ఉన్నామన్నారు. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు కేంద్రం సాయం చేస్తే మరింతలా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. త్వరలో రాష్ట్రంలో డ్రోన్ టాక్సీలు తీసుకువచ్చేంతలా అభివృద్ధి చేస్తామని ఇందుకు అవసరమైన డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. డ్రోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో డ్రోన్లకు డిమాండ్ విస్తృతంగా ఉందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అభిప్రాయపడ్డారు. దీనిని ఊహించి రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్ సిటీని తీసుకు వచ్చిందన్నారు. ఐటీకి గుర్తింపు లేని సమయంలోనే ఐటీ భవిష్యత్‌ను ఊహించి అవకాశాలను సీఎం చంద్రబాబు అందిపుచ్చుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు డ్రోన్లు, స్పేస్, ఏఐ, క్వాంటం విషయంలోనూ చంద్రబాబు ముందంజలో ఉన్నారని తెలిపారు. దేశంలోనే తొలిసారి డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలను నెలకొల్పిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో డ్రోన్ డిజైన్, తయారీ, సేవలు, ఆర్ అండ్ డీ రంగాల్లో అభివృద్ధి చెందేలా డ్రోన్ సిటీ నిర్మాణం జరగనుంది. డ్రోన్ సిటీలో అధునాతన తయారీ పార్కులు, టెస్టింగ్ – సర్టిఫికేషన్ సెంటర్లు, 25 వేల మంది రిమోట్ పైలట్‌లకు శిక్షణ ఇవ్వనున్నారు. డ్రోన్ సిటీ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేలకు పైగా ఉద్యోగావకాశాలు, రాష్ట్రవ్యాప్తంగా 50 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు జరగనుంది. డ్రోన్ సిటీలో 20 శాతం క్యాపిటల్ సబ్సిడీ, 100 శాతం ఎస్జీఎస్టీ రాయితీ వంటి ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ట్విన్ స్పేస్ సిటీస్‌తో భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ పరిశ్రమల భాగస్వామ్యాన్నిపెంచడమే లక్ష్యగా ప్రభుత్వం పని చేస్తుంది. ఉపగ్రహ ప్రోటోటైప్ తయారీ, స్పేస్ టెక్ స్టార్టప్ ఇంక్యుబేషన్, ఉపగ్రహ విభాగాల తయారీ, లాంచ్ లాజిస్టిక్స్ సపోర్ట్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. స్పేస్ సిటీలో 10 ఏళ్లలో 25 వేల కోట్ల పెట్టుబడులు, 35 వేలకు పైగా ఉద్యోగాలు వస్తాయని అంచనా వేస్తున్నారు. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీని తీర్చిదిద్దుతున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు కేంద్రం సాయం అందించాలని కోరారు. త్వరలో రాష్ట్రంలో డ్రోన్ టాక్సీలు అభివృద్ధి చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీ స్పేస్ పాలసీ 4.0లో భాగంగా స్పేస్ టెక్ ఫండ్ కింద 100 కోట్ల కేటాయించారు. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీల నిర్మాణంతో భారత వైమానిక–అంతరిక్ష రంగాల్లో కొత్త శకం ఆరంభం కానుంది. స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల సాధనకు డ్రోన్ సిటీ, స్పేస్ సిటీ ప్రాజెక్టులు కీలకం కానుంది. స్పేస్ సిటీకి సంబంధించి బ్లూ స్పేస్, ఎథర్నల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుంది. డ్రోన్ సిటీలో పెట్టుబడులకు అల్గోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, అకిన్ అనలిటిక్స్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, సెన్సెల్మేజ్, ఏర్వేస్ ఇండస్ట్రీస్ సంస్థలు అవగాహనా ఒప్పందం చేసుకున్నాయి. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీల నిర్మాణంతో టెక్నాలజీ, నైపుణ్యాలు, పరిశ్రమలు విస్తరణకు అవకాశం ఉండి. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, సీఎస్ కె. విజయానంద్, మంత్రులు టీజీ భారత్, బీసీ జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ సతీ

# విద్యార్థులకు గ్రంథాలయాలను అలవాటు చేయాలి



మల్కాపురం పతాకం న్యూస్: కొత్త తరం విద్యార్థులకు గ్రంథాలయాలను అలవాటు చేయడమే వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరావు అన్నారు. జీవీఎంసీ 40వ వార్డు షిప్ యార్డు కాలనీలో ఉన్న గాంధీ గ్రామ్ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయం అధికారి బి కనకరాజు ఆధ్వర్యం లో నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయం వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా నాగేశ్వరావు హాజరయ్యారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులతో గ్రంథాలయాల వినియోగంపై ప్రతిజ్ఞ చేయిపించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మీసాల సత్యనారాయణ, కమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 58వ గ్రంథాలయ వారోత్సవాలు వేడుక



చోడవరం, పతాకం న్యూస్: 58వ గ్రంథాలయం వారోత్సవాల ప్రారంభం సందర్భంగా చోడవరంలో కోపరేటివ్ కోలనీ శాఖా గ్రంథాలయంలో ముఖ్య అతిథిగా శాసనసభ్యులు కె ఎస్ ఎన్ఎస్ఎన్ రాజు, శిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిరి, అలాగే ఇంచార్జి గ్రంథాలయాధికారిణి శ్రీమతి ఎమ్ ఎస్ ఎల్ జోగేశ్వరి గ్రంథాలయ ప్రతిజ్ఞ చేయించిరి,శ్రీరామమూర్తి మాట్లాడుతూ చోడవరం గ్రంథాలయంలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఇద్దరు వారి వంతు కృషి చేస్తామని తెలియజేసిరి, ఈ కార్యక్రమంలో గూనూరు మల్లు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షులు, కందర్ప రమణమూర్తి బిజెపి ఉపాధ్యక్షులు, చోడవరం సర్పంచ్ శ్రీమతి బండి నూకాలమ్మ కొట్టాపు రూపాదేవీ చిన్న ఎంపిటిసి యర్రంశెట్టి చిన్న గారు, టౌన్ పార్టీ ప్రెసిడెంట్, టీ. శ్రీను వార్డ్ మెంబర్, గూనూరు మూలినాయుడు , జనసేన పార్టీ మండల అధ్యక్షులు మరియు పిఏసిఎస్ అధ్యక్షులు, గూనూరు మూలి నాయుడు సిరిపురపు రమేష్ జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, నానుబిల్లి శ్రీను , తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తానవరపు రమణ , రిటైర్డ్ టీచర్, దొడ్డి కిషోర్ , మాజీ సర్పంచ్, డైరెక్టర్, ఉపాధ్యాయుల శ్రీనివాస్ జ్యోతిరావు పూలె ఉపాధ్యాయులు, విద్యార్థినులు అధికారులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలను సమర్ధవంతంగా వినియోగించుకోండి



సింహాచలం, పతాకం న్యూస్: గ్రంథ పఠనాన్ని జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని, గ్రంథాలయాలను సమర్ధవంతంగా వినియోగించగలిగితే ఎంతో ఉన్నతిని సాధించవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు అడివివరం శాఖ గ్రంథాలయంలో శుక్రవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన 98 వ వార్డు కార్పొరేటర్ పి వి నరసింహం మాట్లాడారు. గ్రంథాలయాలు ప్రజలకు చేరువ కావడం వలన ప్రజల్లో పఠనాశక్తి పెరిగిందని అన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు గ్రంథాలయాలు బాసటగా నిల్చడం ఎంతో ఆనంద దాయకమని అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు బాలల దినోత్సవం సందర్భంగా భారత మాజీ ప్రధాని చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడవివరం శాఖా గ్రంథాలయాధికారి ఎన్వి నరసింహం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ స్థలదాత దాసరి సన్యాసి శెట్టి, విశ్రాంత తాహసిల్దార్ బి. సత్య నారాయణ, కార్మిక నాయకులు సి హెచ్ ఎస్ ఎన్ రాజు, వాణి విద్యా విహార్ కరెస్పాండె%శీ%టు అపర్ణ న్యాయవాది కె. రామక్రిష్ణ, మణిబాబు, ఎల్లమ్మ ,తదితరులు పాల్గొన్నారు. వారోత్సవాల ప్రతిజ్ఞ చేయడం జరిగింది. అనంతరం పాఠశాల ల విద్యార్థులుకు చిత్రలేఖనం పోటీలు పిట్ల త్రినాథరావు న్యాయనిర్ణేతగా వ్యవహరించి నిర్వహించారు.

# భోగాపురంలో రహస్య భూ సర్వే



- భూముల గుర్తింపునకు ప్రత్యేక బృందం
- వీఎంఆర్‌డిఏ ఆధ్వర్యాన రియల్ ఎస్టేట్‌కు సన్నాహాలు?
- ఐటి పరిశ్రమల పేరిట మరికొంత

**విజయనగరం, పతాకం న్యూస్:** భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల ప్రాంతంలో రహస్య భూ సర్వే జరుగుతోంది. వీఎంఆర్‌డిఏ ఆధ్వర్యాన రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా జాతీయ రహదారికి, ఎయిర్‌పోర్టు రహదారులకు సమీపంలోగల భూములను గుర్తించేందుకు వీఎంఆర్‌డిఏ ఆధ్వర్యాన ప్రత్యేక బృందాన్ని నియమించింది. ఎంత భూమి దొరికితే అంత గుర్తించాలని రెవెన్యూ, సర్వే సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది. మూడు పంటలు పండే వ్యవసాయ భూమి అయినా, కోనసీమను తలపించే కొబ్బరి తోటలైనా, చివరకు పేద రైతుకున్న పది సెంట్ల భూమైనా లాక్కొని లేఅవుట్లు వేయాలని నిర్దేశించింది. అక్కడక్కడా భౌతిక పరిస్థితులు ఆటంకంగా మారినా కనీసం 20 ఎకరాలు ఉన్న ప్రతి ప్రదేశాన్ని ల్యాండ్ పార్శిల్ చేయాలని మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. దీనికి అనుగుణంగా భోగాపురం మండలంలోని వివిధ గ్రామాల్లో వీఎంఆర్‌డిఏ గుట్టుచప్పుడు కాకుండా సర్వే చేస్తున్నారు. భోగాపురం మండలం గూడెపువలస రెవెన్యూ పరిధిలోని భూములను వీఎంఆర్‌డిఏ సర్వే అసిస్టెంట్ ఖాజా బాబా, గూడెపువలస వీఆర్‌ఓ వాగ్దేవి కొద్దిరోజుల క్రితం పరిశీలించారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ మట్టా అయ్యప్ప రామకృష్ణారెడ్డి, కొల్లి రామ్మూర్తి సహా పలువురు రైతులు ప్రభుత్వ సిబ్బందిని ప్రశ్నించారు. అంతకుముందు లింగాలవలస గ్రామంలో కూడా సర్వే చేయడానికి వచ్చిన అధికారులను రైతులు అడ్డుకుని వెనక్కి పంపారు. అయినా, సర్వేలు ఆగడం లేదు. వీఎంఆర్‌డిఏ ప్రత్యేకంగా నియమించిన వీఆర్‌ఎలు, సర్వేయర్లు పంట పొలాల్లోకి వెళ్లి రికార్డులు, మ్యాపులతో సర్వే చేస్తున్నారు. ఎయిర్‌పోర్టు పేరిట సుమారు 2,700 ఎకరాలను ఇప్పటికే ప్రభుత్వం సేకరించింది. ఇది చాలదన్నట్టుగా ఎయిర్‌పోర్టుకు, జాతీయ రహదారికి కనెక్టవిటీ (ట్రంపెట్) పేరిట మరో 12.50 ఎకరాలు, లింకురోడ్ల కోసం మరికొంత తీసుకుంది.

మరోవైపు ఎయిర్‌పోర్టు నుంచి విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు అనుసంధానం చేస్తూ మరో 13 రహదారుల నిర్మాణానికి భూసేకరణ పెద్ద ఎత్తున జరుగుతోంది. ఇదే మండలంలో పరిశ్రమల పేరిట చాలా కాలం క్రితమే మరో 300 ఎకరాలను ఎపిఐఐసి ద్వారా ప్రభుత్వం రిజర్వు చేసింది. అక్కడ ఎలాంటి పరిశ్రమలూ నేటికీ ఏర్పాటు కాలేదు. మరోవైపు ప్రైవేటు రియల్ ఎస్టేట్ లేఅవుట్లు ఎక్కడికక్కడా కుప్పలుతెప్పలుగా ఉన్నాయి. దీంతో, ఈ ప్రాంతంలో కొన్నేళ్లగా వ్యవసాయ, ఉద్యాన పంటలు, తోటల సాగు ఘననీయంగా తగ్గిపోయింది. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో భూముల విలువ విశాఖ, అమరావతిని తలదన్నే రీతిలో మారిపోనున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి భూములపై ప్రభుత్వం కన్నుబడింది. భోగాపురం చుట్టుపక్కల కనుచూపు మేరలోని భూములను ల్యాంగ్‌పూలింగ్ పద్ధతిలో లాక్కోవడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. భవిష్యత్తులో పూసపాటిరేగ, విశాఖ జిల్లా ఆనందపురం, తగరపువలస, భీమిలి, పద్మనాభం మండలాల్లో కూడా కనీసం 25 వేలకుపైబడి సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. మరోవైపు ఐటి, ఎడ్యుకేషనల్ హబ్ పేరిట విజయనగరం కలెక్టర్ ఆధ్వర్యాన సుమారు పది వేల ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకోసం ఇటీవల భోగాపురం మండలం అమనాం జంక్షన్ సమీపంలోని పోలిపల్లి రెవెన్యూ పరిధిలో మాజీ సైనికులకు కేటాయించిన భూములను జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ ఇటీవల పరిశీలించారు.

# నర్సీపట్నం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘన ప్రారంభం




**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి, కుమారుడు విజయ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పద్మావతి చేత పతాకావిష్కరణతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కొత్త సీసీ కెమెరాలను విడిది చేశారు. దేశ మొట్ట మొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రారంభోత్సవ సమావేశానికి విశ్రాంత గ్రంథాలయ అధికారి కె. త్రిమూర్తులు రెడ్డి అధ్యక్షత వహించారు. ఎంఈఓ-1 తలుపులు, ఎంఈఓ-2 నాగేంద్ర పాల్గొన్నారు. సమావేశంలో మాట్లాడుతూ చింతకాయల విజయ్ ం నర్సీపట్నం విద్యా అభివృద్ధికి అయ్యన్నపాత్రుడు చేసిన సేవలను గుర్తుచేశారు. పుస్తకాల పఠనం ప్రతి ఒక్కరి జీవితంలో అలవాటు కావాలని సూచించారు. అంబేద్కర్ లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని, స్వాతంత్ర్య సమరయోధుల కథలు విద్యార్థులు తప్పకుండా చదవాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయ అభివృద్ధికి అవసరమైన సోలార్ సిస్టంను త్వరలో అందిస్తానని, తన పేరుతో 100 పుస్తకాలు దానం చేస్తున్నట్లు తెలిపారు. ఎంఈఓ తలుపులు మాట్లాడుతూ గ్రంథాలయ వినియోగం పెరగాలని, అభివృద్ధికి అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు. ఎంఈఓ నాగేంద్ర మాట్లాడుతూ ం ప్రపంచంలోని గొప్ప వ్యక్తులందరూ గ్రంథాలయాలనే ఆధారంగా చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకున్నారని, వ్యక్తిత్వ వికాసానికి ఇవి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. గ్రంథాలయ అధికారిణి దమయంతి మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, బీడీసీ ఉద్యోగులు, యువత

# ఎస్సీ కార్పొరేషన్ కు నిధులు కేటాయించాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** ఎస్సీ కార్పొరేషన్ కి నిధులు కేటాయించాలని డిబి ఎస్.యు రాష్ట్ర కార్యదర్శి పి.చిట్టిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కి వినతి పత్రం అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీల ఆర్థిక అభివృద్ధికి అనేకమైన పథకాలు అమలు జరుగుతూ ఉండేవి. గత ప్రభుత్వ హయాంలో 29 పథకాలు రద్దుచేసి దళితుల ఆర్థిక అభివృద్ధికి అన్యాయం జరిగింది. ఇప్పుడు వచ్చిన ఈ కూటమి ప్రభుత్వము, రద్దు చేయబడిన పథకాలను పునరుద్ధరించాలని, బడ్జెట్లో ఎస్సీల సంక్షేమానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని, నిర్వీర్యం అవుతున్న ఎస్సీ కార్పొరేషన్ను బలోపేతం చేయాలని, భూ కొనుగోల పథకం ఎస్సీ మహిళలకు భూమి కొని ఇవ్వాలని, 2025 లో ఇచ్చిన వార్షిక యాక్షన్ ప్లాన్ అమలు తక్షణమే చేసి ఎస్సీ నిరుద్యోగులను ఆదుకోవాలని, 2019 బి 2020 సంవత్సరంలో ఎన్ ఎస్ ఎఫ్ డి సి క్రింద ఇచ్చిన కార్ల లోను రుణమాఫీ చేయాలని, కరోనా సమయంలో ఇచ్చిన కార్లు ఉపాధి లేక బేరాలు దొరకక అప్పుల పాలైన వారి జీవితాలను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మరియు నిన్న ఎన్‌ఎస్‌ఎఫ్‌డిసి ద్వారా ఇచ్చిన కారులను ప్రభుత్వ కార్యాలయాలకు లీజుకు తీసుకునేందుకు ప్రభుత్వమే చొరవ చూపించేందుకు తగిన ఆదేశాలు ఇవ్వాలని ఎస్సీ ఎస్టీ చదువుకున్న నిరుద్యోగులకు స్వయం ఉపాధి నిమిత్తము ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని, ఎస్సీ ఎస్టీ అత్యాచారాల బాధితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక రుణాలు మంజూరు చేసి బాధితులు ఆదుకోవాలని ఎస్సీ మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసేందుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని, ఎస్సీ స్వచ్ఛంద సంస్థలకు శిక్షణ కార్యక్రమాల మనలో భాగస్వామ్యం కల్పించి ఎస్సీల ఆర్థిక స్వావలం మనకు కృషి చేయాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. చైర్మన్ స్పందిస్తూ బడ్జెట్ కేటాయింపులకు 340 కోట్లు ఎస్సీ కార్పొరేషన్ కేటాయిస్తున్నట్లు తెలియజేశారు.

# సీఎం చంద్రబాబు విజన్ అద్భుతం

## ఏపీ అభివృద్ధికి పారిశ్రామిక దిగ్గజాల భరోసా







**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో తాము కూడా భాగస్వాములమవుతామని, రాష్ట్ర యువతకు నైపుణ్యాలు అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ అద్భుతమని, ఆయన నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందడం ఖాయమని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైన సీఐఐ 30వ భాగస్వామ్య సదస్సులో పలు దిగ్గజ సంస్థల అధినేతలు పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలపై ప్రశంసల వర్షం కురిపించారు. ఈ సదస్సులో అదానీ పోర్ట్స్, సెజ్ ఎండీ కరణ్ అదానీ మాట్లాడుతూ, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో ఆంధ్రప్రదేశ్ ఆధునిక రాష్ట్రంగా రూపాంతరం చెందుతోందని అన్నారు. దేశంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న స్టార్టప్ స్టేట్‌గా ఏపీ నిలిచిందని, దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శిగా నిలుస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో డేటా సెంటర్లు, ఓడరేవులు, సిమెంట్ ఉత్పత్తి వంటి కీలక రంగాల్లో అదానీ సంస్థ ఇప్పటికే పనిచేస్తోందని, భవిష్యత్తులోనూ ఏపీ వృద్ధిలో తమ సంస్థ కీలక భాగస్వామి అవుతుందని ఆయన ప్రకటించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించడంలో మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషిని కరణ్ అదానీ ప్రత్యేకంగా అభినందించారు. జీఎంఆర్ సంస్థ అధినేత గ్రంధి మల్లిఖార్జున రావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయాలు రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణంలో భాగస్వామి కావడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఒక సమగ్ర ఏరోస్పేస్ ఎకో సిస్టమ్‌ను సిద్ధం చేస్తున్నామని, భోగాపురం ఎయిర్‌పోర్టులోనే విమానాల మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్ హాలింగ్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. భారత్ బయోటెక్ ఎండీ, సీఐఐ ఉపాధ్యక్షురాలు సుచిత్రా కె.ఎల్లా మాట్లాడుతూ, ప్రపంచ వాణిజ్య సవాళ్లను అధిగమిస్తూ భారత్ ముందుకు సాగుతోందన్నారు. కొవిడ్ మహమ్మారి సమయంలో ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన ఘనత భారత్‌కు దక్కిందని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన జీనోమ్ వ్యాలీ నుంచే భారత్ బయోటెక్ కొవిడ్ టీకాను అభివృద్ధి చేసి అందించిందని, ఆయన దూరదృష్టికి ఇదే నిదర్శనమని వివరించారు. బజాజ్ ఫిన్‌సర్వ్ చైర్మన్ సంజీవ్ బజాజ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ దేశానికి ఒక 'గ్రోత్ ఇంజిన్' లాంటిదని అభివర్ణించారు. వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం వాణిజ్యం, సాంకేతికత, ఆవిష్కరణలకు గేట్‌వేగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర యువతకు అండగా నిలిచేందుకు విజయవాడ, విశాఖ, రాజమండ్రి, శ్రీసిటీ, తిరుపతిలలో 'రాహుల్ బజాజ్ స్కిల్లింగ్ సెంటర్ల'ను' ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. భారత్ ఫోర్జ్ జాయింట్ ఎండీ అమిత్ కల్యాణి మాట్లాడుతూ, ఏఐ, డేటా యుగంలో చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ముందంజలో ఉందని అన్నారు. ఇప్పటికే రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో రాష్ట్రంలో పనిచేస్తున్నామని, భవిష్యత్తులో నౌకా నిర్మాణం, పర్యాటక రంగాల్లోనూ పెట్టుబడులు పెడతామని తెలిపారు. లులూ గ్రూప్ చైర్మన్ యూసఫ్ అలీ మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అత్యాధునిక మాల్స్‌తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. సీఎం చంద్రబాబు కలలకు అనుగుణంగా ఏపీ అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఆయన అన్నారు.

# కొత్తమల్లంపేటలో నానో యూరియా,డ్రోన్ వినియోగంపై రైతులకు శిక్షణ



**గొలుగొండ, పతాకం న్యూస్:** వ్యవసాయ శాఖ మరియు ఆత్మ సంయుక్తంగా గొలుగొండ మండలం కొత్త మల్లంపేట గ్రామంలో శుక్రవారం వ్యవసాయంలో నానో యూరియా మరియు డ్రోన్ వినియోగంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నర్సీపట్నం సహాయ వ్యవసాయ సంచాలకులు టి.శ్రీదేవి మాట్లాడుతూ నానో టెక్నాలజీ ఉపయోగించి,50 కేజీల యూరియా బస్తాను,అర లీటర్ సీసాలో తయారు చేసిన నానో యూరియాను ఒక ఎకరానికి అర లీటర్ సీసా స్ప్రే చేయాలని సూచించారు. ఈ నానో యూరియాను అన్ని పంటల్లోనూ వినియోగించవచ్చని తెలిపారు.ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ (బీటీఎం) సి.హెచ్.లక్ష్మి కిషోర్ మాట్లాడుతూ డ్రోన్‌ల ద్వారా ప్రస్తుతం వరి పంటపై యూరియా మరియు తెగులు పురుగుల మందులు పిచికారి చేస్తున్నట్లు వివరించారు. పది నిమిషాల్లో ఒక ఎకర పొలం పిచికారి పూర్తవుతుందని, బరువులు మోయాల్సిన అవసరం లేదని, వాతావరణ కాలుష్యం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు.

# రంగు మారిన ధాన్యాన్ని ఎప్పుడూ కొనుగోలు చేస్తారు?



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** మొంథా తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు వేలాది ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడంతో పలు జిల్లాలో నాలుగైదు రోజులపాటు నీటిలోనే వరి చేలు ఉండిపోయాయి. తుపాను ముగిసిన తర్వాత ప్రస్తుతం రైతులు వరి కోతలకు సిద్ధమవుతున్నారు. కోసిన ధాన్యం పచ్చిగా ఉండడంతో, ఎండలో ఆరబెడుతూ నానా అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి ధాన్యం తడిగా ఉండడంతో రంగు మారే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు ధాన్యం తడిచిపోవడంతో తేమ శాతం పెరిగిపోవడంతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా? లేదా? అనే ఆందోళనతో రైతులు ఉన్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో ఈ నెల ఐదో తేదీన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రైతులు ఇబ్బంది పడకుండా తేమ శాతం పెంచడంతో పాటు రంగు మారిన ధాన్యం కొనుగోలు చేస్తామంటూ ప్రకటించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలను వెలువరిస్తామంటూ చెప్పారు. దీంతో, వాటి కోసం అధికారులు, రైతులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఉభయగోదావరి జిల్లాల్లో ధాన్యం కొనుగోలు మొదలైంది. తేమ శాతం 17 ఉండాలని ప్రభుత్వం గత నెల 22న వెలువరించిన జిఒ నంబరు 23లో పేర్కొంది. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటన నేపథ్యంలో తేమ శాతం విషయంలో ఏం చేయాలో అధికారులకు తోచడం లేదు. తేమ శాతం 17 శాతానికి మించితే తిరస్కరించాలా? స్వీకరించాలా? అనే స్పష్టత లేకపోవడంతో గందరగోళం నెలకొంది. మొంథా తుపాను ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా 3.95 లక్షల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. 33 శాతం నష్టం దాటిన పంటకే జాబితాలో చోటు కల్పించారు. కనీసం ఒక్క శాతం తక్కువైనా లెక్కించలేదు. దీంతో, అటువంటి రైతులంతా అటు పంట నష్టపరిహారానికి నోచుకోక, ఇటు ప్రభుత్వం నుంచి తేమ శాతం, రంగు మారిన ధాన్యం విషయంలో మినహాయింపులు పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో పల్లపు ప్రాంతాల్లో నేటికీ నీటిలోనే వరి చేలు ఉన్నాయి. మరోవైపు ఈదురుగాలుల తీవ్రతకు పంట వాలిపోవడంతో కోసేందుకు సాధ్యపడడం లేదు. 33 శాతం నిబంధనతో పరిహారం జాబితాలోనూ చోటు దక్కలేదు. పంట కోతకు భారీగా ఖర్చులు అడుగుతుండడంతో కోతలకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. పొలాల్లోనే పంటను వదిలేస్తున్నారు. తేమ శాతం సడలింపు విషయంలో వెంటనే ఉత్తర్వులు ఇచ్చి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# నేడు వైభవోపేతంగా శివపార్వతుల కళ్యాణం



**గాజువాక, పతాకం న్యూస్:** శనివారం ఉదయము 10 గంటలకు నెల్లిముక్కు రామాలయం ప్రక్కన గల శ్రీ శ్రీ గోవింద మాంబా సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కాశీ విశ్వేశ్వర స్వామి వారి కార్తీక మహోత్సవాలు సందర్భంగా శివపార్వతుల కళ్యాణం అతి వైభవంగా నిర్వహించనున్నారు. బహుళ ఏకాదశి నాడు ప్రతి సంవత్సరము మాదిరి ఈ సంవత్సరం కూడా శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అరుణ్ కుమార్ శర్మ, కొత్త లంక భువన శర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం కనుల పండుగగా జరిపించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు జరిగాయి. అనంతరము అన్న ప్రసాద వితరణ చేయనున్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 75 వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి వెంకటరమణారెడ్డి విచ్చేసి కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ కార్తీకమాసంలో ప్రజలందరూ శివుని ఆశీస్సులు పొందాలని ఈ ప్రాంత అభివృద్ధి చెందాలని ఆ మహాదేవుని ప్రార్థిస్తున్నానన్నారు. ప్రతి ఒక్కరు కూడా ఈ అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాలు స్వీకరించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ముదుర్తి శ్రీరామ్ మూర్తి, ద్వారపూడి గురునాధరావు, పూడి హరీష్, వై శివప్రసాద్, కొమ్మోజి కిషోర్ స్వామి, పుట్ట కృష్ణ, గోర్స సురేష్, ముద్దు మణికంఠ, దొమ్మేటి సోమ నాయుడు, కోరుబిల్ల అప్పారావు, పెట్ట మనోహర్ రెడ్డి, కనీతి అప్పలరాజు పాల్గొన్నారు.

# తీవ్ర ఆకలితో ఉన్న దేశాల జాబితాలో ఇండియా

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారతదేశం ఇంకా తీవ్ర ఆకలితో ఉన్న దేశాల జాబితాలోనే ఉందని ఐక్య రాజ్యసమితి తాజా నివేదిక వెల్లడించటం- మన పాలకులు చెప్పే గొప్పలను తుత్తునియలు చేస్తోంది. ప్రపంచంలోనే నాలుగో ఆర్థిక శక్తిగా అవతరించామంటూ మోడీ ప్రభుత్వం మోగిస్తున్న డాంబికాల ఢంకాకు ఆకలి సూచి అందించిన అంకెల సమాచారం పెద్ద చిల్లునే పెట్టింది. ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) లో భాగంగా రూపొందించిన మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎంపిఐ) ప్రకారం%% ప్రపంచంలో ఎక్కువమంది ఆకలితో నిద్రపోతున్న ఐదు దేశాల్లో మనదీ ఒకటి. మనదేశంలో 24.3 కోట్ల మంది రోజూ ఆకలితోనో, అర్ధాకలితోనో పొద్దుబుచ్చుతున్నట్టు ఐక్యరాజ్య సమితి అధ్యయనంలో తేలింది. ఆకలి విషయంలో పాకిస్తాన్, ఇథియోపియా, నైజీరియా, కాంగో సరసన మన దేశమూ ఉండడం చాలా శోచనీయం. ప్రపంచంలో 110 కోట్ల మంది ఆకలితో అల్లాడుతుంటే- అందులో 40 శాతం మంది ఈ ఐదు దేశాల్లోనే ఉన్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ సహకారంతో యుఎన్‌డిపి 127 దేశాల్లో ఈ సర్వేను నిర్వహించింది. ప్రజలకు ఆహారం మెరుగ్గా అందుతున్న దేశాల్లో మనది 102వ స్థానం కావటం ఆందోళనకరం. మనపక్కన ఉన్న శ్రీలంక (61), నేపాల్ (72), బంగ్లాదేశ్ (85) మనకన్నా ముందు స్థానాల్లో ఉన్నాయి. ఇటీవలి కాలంలో తీవ్ర రాజకీయ సంక్షోభాలను ఎదుర్కొన్న ఈ దేశాలు తమ ప్రజలకు తగినంత ఆహారం సమకూర్చటం లో మనకన్నా ముందు పీఠిన నిలవటం గమనార్హం. మనదేశం ఆహార ఉత్పత్తిలో ముందంజలో ఉన్నప్పటికీ- ఆకలి, పోషకాహారలోపం కొనసాగటం అత్యంత అసమతుల్య ఆర్థికాభివృద్ధికి అద్దం పడుతోంది. సంపన్నులు మరింత సంపన్నులు కావటం, పేదలు మరింత పేదలుగా దిగజారటం అసమ అభివృద్ధిలోని తీవ్రమైన దుర్లక్షణం. మనదేశంలో సంపన్నుల అభివృద్ధి పథాలు, వారి కొరకు నిర్మితమయ్యే సౌకర్యాల స్వర్గధామాలు ప్రాచుర్యం పొందినంతగా- సామాన్యుల స్థితిగతులు, పేదల రోజువారీ బతుకు పాట్లు ప్రచారం పొందవు. చర్చలోకి రావు. కానీ, రోజుకు నూట అరవై



రూపాయల ఆదాయం కూడా పొందలేని పౌరులు పుష్కలంగా ఉన్న దేశం మనది. ఇండియాలో ఆహార పంపిణీలో తీవ్రమైన అంతరం ఉందని, పేదరికం, పిల్లల్లో పోషకాహార లోపం, పారిశుధ్య లోపం హెచ్చుస్థాయిలో ఉన్నాయని యుఎన్‌డిపి నివేదిక ఎత్తిచూపింది.

మనదేశంలో కార్పొరేట్ల అడుగులకు మడుగులొత్తే ప్రజావ్యతిరేక పాలక విధానాలు దారిద్ర్యాన్ని పెంచటానికి కారణమవుతున్నాయి. పిల్లల చదువులకు, కటుంబ సభ్యుల వైద్యావసరాలకు ఉన్న ఆస్తులను, ఆదాయాలను కోల్పోతున్న కుటుంబాలు ఏటేటా పెరుగుతున్నాయని కోవిడ్ కాలం నాటి దుర్భర పరిస్థితి వెల్లడి చేసింది. మౌలికమైన విద్యా వైద్య రంగాల్లో పెనవేసుకుపోయిన ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ సామాన్యుల ఉసురు తీస్తున్నాయి. దేశానికి తిండిని అందించే వ్యవసాయ రంగంలో నిత్యం సంక్షోభం ఆవహించే ఉంటుంది. గిట్టుబాటు ధర లేకపోవటం, మార్కెట్టు సమస్యలు, పెట్టుబడులు ఏటేటా పెరగటం %% ఆ రంగాన్ని ఆధారంగా చేసుకొని బతుకుతున్న కోట్లాది కుటుంబాలను అతలాకుతలం చేస్తున్నాయి. అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ల కేంద్రంగా తప్ప- సామాన్య ప్రజల జీవనావసరాలకు ఆలంబనగా పాలకుల విధానాలు ఉండడం లేదు. ఈరీత్యా పైకి అభివృద్ధి పూనకాలను ప్రచారంలో ఊదరగొడుతున్నా - పునాది రంగాలు ఊతం లేక విలవిల్లాడుతున్నాయి. ఈ వాస్తవాలను మరుగున పర్చి, దేశాన్ని ఉద్వేగాలూ, ఉన్మాదాలతో ఊగించటం మోడీ ప్రభుత్వం ఒక వ్యూహంగా సాగిస్తోంది. ఈ ధోరణి ఏ సమస్యనూ పరిష్కరించదు. ప్రపంచంలో 82 కోట్ల మంది పోషకాహార లోపంతో బాధపడుతుంటే - అందులో 20 కోట్ల మంది మనదేశం లోనే ఉన్నారు. రోజూ పస్తులతో పడుకుంటున్న అన్నార్తుల్లో 24 శాతం మంది మనవాళ్లే! ఆకలి, పోషకాహార లేమి కారణంగా రోజూ 4500 మంది పిల్లలు చనిపోతున్నారు. ఇలాంటి దుస్థితి నుంచి బయటపడాలంటే కార్పొరేట్లను పెంచి పోషించే నయా ఉదార విధానాలకు స్వస్తి చెప్పాలి. దుర్భర దారిద్ర్యాన్ని తరిమి కొట్టటానికి కేరళ వామపక్ష ప్రభుత్వం చేపట్టిన విధానాన్ని అనుసరించాలి. కళ్లు మిరుమిట్లు గొలిపే ఉపాధి రహిత అభివృద్ధి వల్ల ఉపయోగం లేదు. ప్రజల కనీస అవసరాలను తీర్చే సమతుల అభివృద్ధి, స్థిరమైన ఆదాయ కల్పన ఇప్పుడు అత్యవసరం. అప్పుడే ఆకలికి చెల్లుచీటి రాయగలం. చరమగీతం పాడగలం.

## పత్తి అమ్మకాల్లో రైతులకు యాప్‌ల కష్టాలు



**విజయవాడ, పతాకం న్యూస్:** : పత్తి రైతులపై ప్రకృతి పగబట్టింది. పంట దిగుబడిపై అధిక వర్షాలు, మొంథా తుఫాన్ తీవ్ర ప్రభావం చూపాయి. చేతికొచ్చిన కొద్దోగొప్పో పంటను అమ్ముకునే తరుణంలో రైతులను యాప్స్ కష్టాలు వెంటాడుతున్నాయి. కాస్త పత్తిని అమ్ముకుని, పెట్టుబడి ఖర్చులైనా దక్కించుకుందామనుకుంటే ఈ యాప్స్ ఇబ్బందులు మరింత తలనొప్పిగా పరిణమించాయి. పోనీ బయట అమ్ముకుందామంటే.. దళారులు కష్టాన్ని దోచుకునేందుకు చూస్తున్నారని, తక్కువకు అడుగుతున్నారని పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన సీఎం యాప్, కేంద్ర ప్రభుత్వానికి చెందిన కపాస్ కిసాన్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఆ రెండు యాప్‌లలో పంట వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. నమోదు సమయంలో ఓటీపీలు ఆలస్యం కావడం, సర్వర్లు పనిచేయకపోవడంతో రైతుల సమయం వృథా అవుతోంది. పత్తిని సీసీఐలో అమ్ముకోవాలనుకుంటే ప్రతి రైతు.. రైతుసేవా కేంద్రాలకు వెళ్లాలి. ఈ-క్రాప్‌లో నమోదైన పంటను అక్కడి సిబ్బంది సీఎం యాప్‌లో నమోదు చేస్తున్నారు. అనంతరం రైతులు స్మార్ట్‌ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్‌కు వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి చెందిన కపాస్ కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని అందులో పంట నమోదు చేయాలి. ఈ రెండు యాప్‌లలో పంట నమోదు చేయాలంటే రైతులకు స్మార్ట్‌ఫోన్ ఉండాలి. వాటికి వచ్చే ఓటీపీలు చెప్పి నమోదు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల దిగుబడి పడిపోయి చేతికొచ్చిన కాస్తాకూస్తో పత్తిని అమ్ముకునేందుకు ఇన్ని ఇబ్బందులు పడాలా..? అని రైతులు ఆవేదన చెందుతున్నారు.

## ఫాస్టాగ్ లేని వాహనాలకు శుభవార్త.. యూపీఐ పేమెంట్స్‌కు ప్రత్యేక వెసులుబాటు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఫాస్టాగ్ లేని వాహనాలు టోల్‌గేట్ల వద్ద యూపీఐ ద్వారా రుసుము చెల్లిస్తే ఇప్పటివరకు విధిస్తున్న రెట్టింపు ఛార్జీల నిబంధనను సడలించింది. ఇకపై కేవలం 25 శాతం అదనపు రుసుము చెల్లిస్తే సరిపోతుందని స్పష్టం చేసింది. ఈ కొత్త విధానం శుక్రవారం తెల్లవారుజాము నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల వద్ద ఫాస్టాగ్ లేని వాహనాలకు టోల్ రుసుముకు రెట్టింపు చెల్లించాల్సి ఉంటుంది. నగదు రూపంలో చెల్లించినా, యూపీఐ ద్వారా చెల్లించినా ఇదే నిబంధన వర్తించేది. అయితే, కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయంతో యూపీఐ ద్వారా చెల్లించే వారికి గణనీయమైన ఊరట లభించనుంది. ఉదాహరణకు, ఒక వాహనానికి టోల్ రుసుము రూ.100 అనుకుంటే.. ఫాస్టాగ్ ఉన్నవారు రూ.100 చెల్లిస్తారు. ఫాస్టాగ్ లేనివారు నగదు రూపంలో చెల్లిస్తే రెట్టింపుగా అంటే రూ.200 చెల్లించాలి. కానీ, కొత్త నిబంధన ప్రకారం యూపీఐ ద్వారా చెల్లిస్తే కేవలం రూ.125 (25 శాతం అదనం) చెల్లిస్తే సరిపోతుంది. ఈ మేరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు టోల్ ప్లాజాల్లో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తున్నట్లు ఓ టోల్‌ప్లాజా అధికారి తెలిపారు. నగదు చెల్లించేవారికి మాత్రం పాత పద్ధతిలోనే రెట్టింపు రుసుము వసూలు చేస్తారని ఆయన స్పష్టం చేశారు.

## నర్సీపట్నంలో ప్రవేశించిన మాదకద్రవ్యాల నిర్మూలనకు అభ్యుదయం సైకిల్ యాత్ర



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పర్యవేక్షణలో జరుగుతున్న అభ్యుదయం సైకిల్ యాత్రకు ప్రజలు మంచి స్పందన ఇస్తున్నారు. పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు జరుగుతున్న ఈ యాత్రలో కోటవురట్ల మండలంలో అధికారులు, పోలీసులు, విద్యార్థులు, గ్రామస్థులు భారీగా పాల్గొన్నారు. కోటవురట్ల-జల్లూరు-శంకుపూర్-ఎండపల్లి గ్రామాల్లో పాంప్లెట్ పంపిణీ, అవగాహన సమావేశాలు నిర్వహించారు. నర్సీపట్నం రూరల్, టౌన్ పరిధుల్లో కూడా అవగాహన ర్యాలీలు జరిగాయి. ధర్మశాగరంలో భాష్యం స్కూల్ విద్యార్థులతో ఎస్సై రాజారావు ర్యాలీ నిర్వహించగా, నర్సీపట్నం టౌన్‌లో కెన్విన్ స్కూల్ జంక్షన్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి సైకిల్ ర్యాలీ చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు,రూరల్ రేవతమ్మ, పట్టణ సిఐ గోవిందరావు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వ్యసనంపై 5 జిల్లాల్లో డీ-అడిక్షన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. పాడేరు, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం కేంద్రాల్లో ఇప్పటివరకు వందల మందికి చికిత్స అందించారు. కౌన్సిలర్ల నియామకం, ఉపాధ్యాయులకు శిక్షణ, తల్లిదండ్రుల్లో అవగాహన పెంపు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. "డ్రగ్స్ ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరం. ఉచిత, గోప్య చికిత్స అందుబాటులో ఉంది" అని డీఐజీ గోపినాథ్ జట్టి తెలిపారు.

# మహిళల భద్రత, రక్షణ కోసం సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** మగువల కన్నీటి కష్టాలను పరిష్కరించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. మహిళల సాధికారికతకు కృషి చేయడమే కాకుండా వారికి ఏ సమస్య వచ్చినా అండగా నిలిచేందుకు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. మహిళల భద్రత, రక్షణ కోసం రోజులో 24 గంటలూ ఆయా కేంద్రాలు అందుబాటులో ఉంటాయి. గృహహింసకు గురైనా, దాడులు జరిగినా బాధితులు ఆయా కేంద్రాలను సంప్రదిస్తే వైద్య సాయంతోపాటు పునరావాసం కల్పిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసు, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ బాధితులకు చేయూతనిస్తారు.

**మహిళలకు 100 :** మహిళలు, యువతులు, విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే 100 నంబరుకు ఫోన్ చేస్తే వెంటనే స్పందించి ఆదుకుంటారు. దూరప్రాంతమైతే ఆ ప్రాంత పోలీసులకు సమాచారం చేరవేసి రక్షణ కల్పించేలా చూస్తారు.

**181 మహిళా సహాయ కేంద్రం :** మహిళలను కట్నం కోసం వేధించడం, శారీరక, మానసిక వేధింపులకు పాల్పడిన సందర్భంలో బాధితులు 181 నంబరుకు ఫోన్ చేయొచ్చు. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది వివరాలు నమోదు చేసుకుని బాధితులను ఆదుకునేలా చర్యలు చేపడతారు.

**1930 సైబర్ నేరాలపై :** కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల ద్వారా మహిళలతో పరిచయాలు పెంచుకుంటారు. ఈ క్రమంలో వివిధ రూపాల్లో వారిని బెదిరిస్తే 1930 నంబర్‌ను ఫోన్ చేసి సాయం కోరవచ్చు. పోలీసు అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేస్తారు. ఆన్‌లైన్‌లో ఆర్థిక మోసాలకు పాల్పడిన వారిపై ఫిర్యాదు చేస్తే బ్యాంకుఖాతా నుంచి నగదు లావాదేవీలను నిలిపేస్తారు.

**జాతీయ న్యాయ సహాయ కేంద్రం 15100 :** న్యాయస్థానాల్లో కేసులకు సంబంధించి 15100 నంబరుకు ఫోన్‌చేసి న్యాయసేవలు పొందవచ్చు. కోర్టుల్లో న్యాయవాదులను పెట్టుకోలేని మహిళలకు ప్రభుత్వ న్యాయవాది ద్వారా చేయూత నిస్తారు.

**1098 బాలల కోసం :** అలాగే బాలలతో వెట్టిచాకిరీ చేయించడం, పారిశ్రామిక, కర్మాగారాల్లో పనుల్లో పెడితే వారిని రక్షించేందుకు హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేయవచ్చు. అధికారులు వెంటనే స్పందించి వారికి విముక్తి కల్పిస్తారు. బాలలపై హింస, దాడులకు పాల్పడితే వారిపై ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

**మహిళలకు అండగా జీఆర్‌సీలు :** మరోవైపు మహిళలకు అండగా నిలిచేందుకు



కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో జెండర్ రిసోర్స్ కేంద్రాలు (జీఆర్‌సీ)ను ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలోనే విశాఖపట్నం జిల్లాలో ఇప్పటికే రావికమతం, నక్కపల్లిలో సేవలు అందిస్తున్నాయి. నర్సీపట్నం, కె.కోటపాడుకు కొత్తగా మంజూరయ్యాయి. మరో మూడు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలున్నాయని అధికారులు తెలుపుతున్నారు. సామాజిక మాధ్యమాలు, సమాజంలో చోటుచేసుకుంటున్న పలు ఘటనలతో అతివలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కలత చెందడం, ఎవరికీ చెప్పుకోలేక వారిలో వారే కుమిలిపోతే మానసికంగా కుంగిపోతున్నారు. పోలీసు స్టేషన్ వరకు వెళ్లలేక మిన్నకుండిపోతున్నారు. ఇలాంటి వారందరికీ జీఆర్‌సీతో ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా ప్రతినిధులే వీటిని నిర్వహిస్తున్నారు. ప్రత్యేక కమిటీలు బాధిత మహిళలకు దన్నుగా నిలిచి కష్టాల నుంచి గట్టెక్కించేందుకు తోడ్పాటునందిస్తాయి. కేంద్రాల్లోనే ఒకటి రెండు రోజులు వసతి సదుపాయం కలిస్తారు.

## జోగంపేట జడ్పీ హైస్కూల్‌లో బాలల దినోత్సవం సంబరం

**గొలుగొండ, పతాకం న్యూస్:** చాచాజీ జయంతిని పురస్కరించుకొని జోగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేకంగా ఆటల పోటీలు,బహుమతుల ప్రదానం కార్యక్రమాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాయి. పాఠశాల హెచ్‌ఎం నాగభూషణం, ప్రత్యేక ఉపాధ్యాయులు తమ్మిల మాణిక్యం ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో చిత్రలేఖనం,క్రాఫ్ట్ వర్క్, మ్యూజికల్ చైర్,చెస్,క్యారమ్,రన్నింగ్, మట్టి ప్రతిమల తయారీలు ప్రధానమైనవి. దివ్యాంగ చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చాటారు.ఇలాంటి కార్యక్రమాలు దివ్యాంగులలో మానసిక,శారీరక,విద్యాపరమైన అభివృద్ధికి దోహదం చేస్తాయని ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ప్రేరేపిస్తాయని ప్రత్యేక ఉపాధ్యాయులు మాణిక్యం తెలిపారు.విజేతలకు పెన్స్,పెన్సిల్ బాక్సలు,స్నాక్



బాక్సలు,వాటర్ బాక్సలు, నోట్‌బుక్స్‌ను హెచ్‌ఎం నాగభూషణం, ఎస్‌ఎంసీ చైర్మన్ మురళి అందజేశారు.భారత దేశ మొట్టమొదటి ప్రధానమంత్రి చాచాజీ నెహ్రూ జీవిత చరిత్ర,స్వాతంత్ర్య పోరాటంలో ఆయన సేవలపై హెచ్‌ఎం నాగభూషణం,మాణిక్యం, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కగా వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఈశ్వర్,క్రాంతికుమార్,సత్యనారాయణ,రామరాజు ,సతీష్,నాగరాజు, బాబురావు,ప్రసాద్,రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మీ పేస్ట్‌లో 'ముప్పు' ఉందట!

## పేస్ట్ కొనే ముందు ఇవి చూడటం తప్పనిసరంటున్న నిపుణులు!



దంతాలపై పాచిని తొలగించి పళ్లను శుభ్రపరచడం, బ్యాక్టీరియాలను తరిమి పిప్పిపళ్లను రాకుండా చేయడం టూత్?పేస్ట్?ల ప్రధాన ఉద్దేశం! అంతే తప్ప, పళ్లను మెరిపించడానికో, నురగ అధికంగా రావడానికో ప్రమాదకరమైన పదార్థాలు కలిపిన పేస్ట్?లను వినియోగిస్తే, మొదటికే మోసం వస్తుందంటున్నారు నిపుణులు. అందుకే పేస్ట్?ను కొనే ముందు హానికర పదార్థాలేమున్నాయో చూడాలని సూచిస్తున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం! కేవలం పళ్లను శుభ్రం చేసుకోవడానికి వినియోగించే టూత్‌పేస్ట్‌లకు.. రంగు, రుచి, చిక్కదనం, ఉప్పు, బొగ్గు సువాసనలంటూ ప్రజలను ఆకర్షించేందుకు రసాయనాలను మిళితం చేస్తున్నారు. అందుకే, టూత్?పేస్ట్?లను వినియోగించేటప్పుడు, దాని తయారీలో ఏమేం పదార్థాలు, ఎంత మోతాదులో వినియోగించారనే అవగాహన ప్రతి ఒక్కరికీ ఉండాలని నిపుణులు సూచి స్తున్నారు. నోటిలో ఉండే సహజ బ్యాక్టీరియాకు, ఈ టాక్సిక్ పదార్థాలతో కూడిన టూత్‌పేస్ట్‌లు హాని కలిగిస్తు న్నాయంటున్నారు. ప్రస్తుతం ఈ హానికారక పదార్థాలను వినియోగించకుండా చేసే టూత్ పేస్ట్‌లపై అనేక పరిశోధనలు జరుగుతు న్నాయి. సోడియం లారిల్ సల్ఫేట్(ఎస్‌ఎల్‌ఎస్), టైటానియం డయాక్సైడ్ రహిత టూత్‌పేస్ట్‌లు సైతం మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చేశాయి. హానికారక పదా ర్థాలను టూత్‌పేస్ట్‌ల్లో వినియోగించడం వల్ల దంతాల శుభ్రత మాట పక్కన పెడితే, నోటిలో లాలాజలం ఇంకి అనారోగ్యం బారిన పడే ప్రమా దం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఎందు కంటే ఎస్?ఎల్ఎస్?ను నురగ రావడానికి వినియోగిస్తున్నారని అంటున్నారు. నిజానికి, దీనిని షాంపూలు, సబ్బుల్లో నురగ వచ్చేందుకు వాడు తుంటారని తెలియజేస్తున్నారు. దీనివల్ల నోటిలోని సున్నితమైన పొరకు హాని కలుగుతుందని వివరిస్తున్నారు. దీంతో నోటి అల్సర్లు అధికంగా వస్తున్నాయని పేర్కొంటున్నారు. ఇది డిటర్జెంట్ కావడంతో నోటిలో ఉండే సెలైవాను(లాలాజలం) పోగొట్టి పొడిగా మార్చేస్తుందని హెచ్చరిస్తున్నారు. టూత్‌పేస్ట్ లేదా కలిగిన మౌత్‌వాష్ వాడకం వల్ల కొంతమంది రోగులలో రికరెంట్ ఆప్తస్ అల్సర్ తరచుగా వస్తుందని అధ్యయనం పేర్కొంది. నోటిలోని లాలాజలంలో ఉండే ఎంజైమ్స్, చెడు బ్యాక్టీరియాను దూరంగా ఉంచుతాయంటున్నారు నిపుణులు. కానీ, నోరు పొడిబారిపోయి లాలాజలం ఉత్పత్తి కాకపోతే, ఎంజైమ్స్ లేక హానికరమైన బ్యాక్టీరియాలు దాడి చేస్తాయని చెబుతున్నారు. అదే ఎంజైమ్స్ ఆహార అరుగుదలకు సైతం ఉపయోగపడతాయని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో నోరు పొడిబారిపోయి ఇరిటేషన్ వల్ల అల్సర్లు పెరిగిపోవడం, శుభ్రత తగ్గిపోవడం, వాసన, పిప్పి పళ్లు, చివరికి దంతాలు పూర్తిగా ఊడిపోవడం జరుగుతుందని వివరిస్తున్నారు.

టైటానియం డయాక్సైడ్ : పేస్ట్‌ను తెల్లని రంగులోనికి తీసుకొచ్చేందుకు దీన్ని వాడు తున్నారు. ఇది ఉన్న టూత్‌పే స్ట్‌లను వాడితే పిల్లల్లో ఆటిజం సహా అనేక సమస్యలు వస్తాయంటున్నారు నిపుణులు. టైటానియం డయాక్సైడ్ నానోపార్టికల్స్‌ను పీల్చడం వల్ల క్యాన్సర్ లాంటి సమస్యలు వస్తున్నాయని పలు అధ్యయనాల్లో వెల్లడైంది.

కారగీనన్ : టూత్‌పేస్ట్‌ చిక్కగా ఉంచే వాహకంగా దీనిని వినియోగిస్తారు. పేస్ట్‌ను మృదువుగా, జెల్‌లా ఉంచడంతో పాటు బ్రష్‌పై స్థిరంగా అంటుకునేలా చేస్తుంది. కారగీనన్ వినియోగంపై అభ్యంతరాలున్నాయి, ఇది జీర్ణాశయ సమస్యలు పేగు వాపులాంటి అనారోగ్య సమస్యలను కలిగిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

పేస్ట్ కొనే ముందు, దానిపై ముద్రించిన వివరాల్ని పూర్తిగా చదవాలి. ఏ పదార్థాలున్నాయి. ఏం కలుపుతున్నారో పేస్టుపై ముద్రించిన వివరాల్లో చూడాలి. అవి ఆరోగ్యంపై ఎంతమేర దుష్ప్రభావం చూపిస్తాయో తెలుసుకోవాలి. ఎస్‌ఎల్‌ఎస్, టైటానియం డయాక్సైడ్ లేనివి, పారాబెన్స్, ప్రొపైలిన్, గ్లైకాల్, సింథటిక్ కలర్స్ కలపని, ఫ్లోరైడ్ శాతం తక్కువగా ఉండే టూత్?పేస్టులు మనకు సురక్షితం. ప్రస్తుతం మార్కెట్?లో సహజసిద్ధమైన పదార్థాలతో చేసిన అనేక టూత్?పేస్ట్?లు అందుబాటులోకి వచ్చాయి- డాక్టర్ ఎ.శ్రీధర్?రెడ్డి, దంత వైద్య నిపుణులు

పారాబెన్ ప్రిజర్వేటివ్ : నోటిలోని సూక్ష్మజీవులను చంపడానికి పేస్ట్‌లలో పారాబెన్ ప్రిజర్వేటివ్స్?ను వాడుతున్నారు. ఇవి శరీరంలోని అత్యంత కీలకమైన ఎండోక్రైన్ వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తాయంటున్నారు నిపుణులు. శరీరంలో జీవక్రియ, ఒత్తిడి నియంత్రణ, ఆకలి, నిద్ర, దాహం లాంటివన్నీ ఎండోక్రైన్ వ్యవస్థ మీదే ఆధారపడి ఉంటాయని చెబుతున్నారు.

ఫ్లోరైడ్ : దంతాల సున్నితమైన ఎనామిల్ పూతను రక్షించడానికి ఫ్లోరైడ్?ను టూత్‌పేస్ట్‌లలో కలుపుతారు. దీన్ని గరిష్టంగా 1500 ఫ్లోరిన్ సాంద్రతను అందించాలని ప్రచురించింది. కానీ, దీనికంటే అధికంగా కలుపుతున్నారని, ఫ్లోరైడ్ అధికంగా ఉండే పేస్ట్?ల వల్ల డెంటల్ ఫ్లోరోసిస్ ప్రమాదం ఉందని, దంతాల రంగు మారిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రొపైలిన్ గ్లైకాల్ : టూత్?పేస్ట్ గట్టిపడకుండా, ఎండిపోకుండా ఉండేందుకు ప్రొపైలిన్ గ్లైకాల్?ను కలుపుతారు. దీనిని యాంటీఫ్రీజ్ లాంటి ఇతర ఉత్పత్తుల్లోనూ ఉపయోగిస్తారు. ఇది ఘన, ద్రవ పదార్థాలు వేరుకాకుండా కలిపి ఉంచుతుంది. అందుకే దీని వినియోగంపై అనేక అభ్యంతరాలున్నాయంటున్నారు నిపుణులు.

కృత్రిమ రంగులు : ఆకర్షణ కోసం పలురకాల కృత్రిమ రంగులను పేస్ట్‌లలో కలుపుతున్నారు. వాటిని బ్లూ1, బ్లూ2, ఎల్లో 5, రెడ్ 40 లాంటి పేర్లతో పిలుస్తారని, వీటిని సింథటిక్, పెట్రోలియం, బొగ్గు వంటి వాటితో తయారుచేస్తారని నిపుణులు చెబుతున్నారు. టూత్‌పేస్ట్‌లలో కలిపే రంగుల వల్ల, అలెర్జీ, నోటి పుండ్లు లాంటి సమస్యలొస్తాయంటున్నారు.

# ముఖంపై మచ్చలున్నాయా.. ఇవి రాయండి ఇట్టే పోతాయ్..



ముఖంపై వచ్చే పిగ్మంటేషన్‌కి మచ్చలకి కారణాలు ఏంటనేవి చూస్తే హార్మోనల్ చేంజెస్ ఒకటిగా తెలుస్తుంది. హార్మోన్ల మార్పుల వల్ల ఆడవారిలో హార్మోన్ల ఇన్ బ్యాలెన్స్, ప్రెగ్నెన్సీలో వస్తుంది. ముఖ్యంగా పీసీఓఎస్, హైపోథైరాయిడ్, మెనోపాజ వంటి సమస్యలు వస్తాయి. ఈ కారణంగా ఇరిటేషన్, మొటిమలు, నల్ల మచ్చలు ఏర్పడతాయి. ఇవన్నీ కూడా స్కిన్‌ని అన్‌ఈవెన్‌గా కనిపించేలా చేస్తాయి. మెలనిన్ తగ్గడం వల్ల స్కిన్‌పై అనేక సమస్యలు వస్తాయి. ముఖంపై వచ్చే డార్క్ ప్యాచెస్‌కి ఇన్‌ఫ్లమేషన్ కూడా ఓ కారణమే. దీని వల్ల డార్క్ ప్యాచెస్ వచ్చి చూడ్డానికి మచ్చల్లా ఏర్పడతాయి. ఇది ఎగ్జిమా, మొటిమలకి కారణమవుతుంది.

నీరు తక్కువగా తీసు కోవడం కూడా చర్మ సమస్యలకి కారణమని చెప్పొచ్చు. నీరు సరిగ్గా తీసుకోకపోవడం వల్ల డార్క్ ప్యాచెస్ ఏర్పడతాయి. కాబట్టి ఏ సీజన్ అయినా నీరు ఎక్కువగా తీసుకోవడం అలవాటు చేసుకోండి. దీనివల్ల స్కిన్ హీల్ అవుతుంది.

కొన్నిసార్లు మనం తీసుకునే మందుల వల్ల కూడా చర్మ సమస్యలు కూడా వస్తాయి. ముఖ్యంగా డయాబెటిస్ వేసుకునే ట్యాబ్లెట్స్ మెలనిన్ ఉత్పత్తిపై ప్రభావం చూపిస్తుంది. దీని కారణంగా ముఖంపై పిగ్మంటేషన్, నల్ల మచ్చలు ఏర్పడతాయి. ముఖంపై ఏర్పడే మచ్చలు తగ్గాలంటే ఫేషియల్ ఆయిల్ తీసుకుని మసాజ్ చేస్తుండాలి. రెగ్యులర్‌గా ఆయుర్వేదిక్ ఆయిల్ అయినా చందన్, కోకొనట్, కుంకుమాది తైలం వంటివాటిని తీసుకుని మసాజ్ చేయాలి. వీటి వల్ల చర్మంపై మచ్చలు తగ్గడమే కాకుండా చర్మం మెరుస్తుందని ఆయుర్వేద ఎక్స్‌పర్ట్, టిఎసి కో ఫౌండర్ శ్రీధ సింగ్ చెబుతున్నారు.అదే విధంగా.. ఇంట్లోనూ కొన్ని పదార్థాలతోనూ చర్మాన్ని మెరిపించొచ్చు. లైకోపీన్ ఎక్కువగా ఉండే టమాటాని తీసుకుని వాటిని ఎండవల్ల కమిలిపోయిన చర్మంపై రుద్దడం వల్ల నల్లని మచ్చలు, పిగ్మంటేషన్ తగ్గి చర్మం మెరుస్తుంది. ఇది అప్లై చేశాక 20 నిమిషాల తర్వాత కడిగేయాలి. కొద్దిగా పసుపు తీసుకుని అందులో పెరుగు, శనగపిండి కలిపి థిక్ పేస్ట్‌లా చేయాలి. దీనిని ఫేస్‌ప్యాక్‌లా వేయాలి. ముఖానికి ప్యాక్ వేసి ఆరగానే గోరువెచ్చని నీటితో కడగాలి.

మైసూర్ పప్పుతో కూడా ప్యాక్ వేసుకోవడం వల్ల చర్మంపై ఉన్న మచ్చలు తగ్గుతాయి. దీనినే ఎర్ర కందిపప్పు అంటారు. ఇందుకోసం 50 గ్రాముల ఎర్ర కందిపప్పుని తీసుకుని నీటిలో పోసి నానబెట్టాలి. ఇప్పుడు దీనిని మెత్తని పేస్ట్‌లా చేసి ముఖంపై అప్లై చేయాలి. దీని వల్ల చర్మంపై ఉన్న నల్ల మచ్చల్ని తగ్గిస్తుంది.

అదే విధంగా రెగ్యులర్‌గా సన్‌స్క్రీన్ అప్లై చేయడం కూడా స్కిన్ డ్యామేజ్ నుంచి తప్పించేలా చేస్తుంది. దీనిని అప్లై చేయడం వల్ల ప్రమాదకరమైన యూవీ రేడియేషన్ తప్పించుకోవచ్చు. ఇందుకోసం పీఏ ప్రొటెక్షన్ ఉన్న సన్‌స్క్రీన్‌ని తీసుకుని రెగ్యులర్‌గా అప్లై చేస్తుంటే పిగ్మంటేషన్, ఎర్లీ ఏజింగ్, నల్లని మచ్చలకి కారణమయ్యే యూవీఏ కిరణాల నుంచి తప్పించుకోవచ్చు.

# అమెరికాలో ముగిసిన షట్‌డౌన్



**న్యూయార్క్:** అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ ఎట్టకేలకు ముగిసింది. అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్.. ప్రభుత్వ ఫండింగ్ బిల్లుపై సంతకం చేశారు. దీంతో అమెరికా చరిత్రలోనే 43 రోజుల పాటు కొనసాగిన అత్యంత సుదీర్ఘమైన ఈ షట్‌డౌన్ అధికారికంగా ముగిసినట్టయ్యింది. ఈ షట్‌డౌన్‌తో వేలాది మంది ఫెడరల్ ఉద్యోగులు వేతనం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనేక విమానాలు ఆలస్యమయ్యాయి. కొన్ని రద్దు కూడా అయ్యాయి. ఫుడ్ బ్యాంకుల ముందు పొడవైన క్యూలు కనిపించాయి. ఇప్పుడు షట్‌డౌన్ ముగియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఓవల్ ఆఫీస్‌లో సంతకం చేసే ముందు ట్రంప్ మాట్లాడారు. "ఈ రోజు మేము స్పష్టమైన సందేశాన్ని పంపిస్తున్నాం. మేము ఎప్పుడూ దోపిడీకి తలవంచం" అని అన్నారు. అంతకముందు అమెరికా ప్రతినిధుల సభ షట్‌డౌన్ ఎత్తివేతకు సంబంధించిన బిల్లును ఆమోదించింది. రిపబ్లికన్ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ఈ సభలో 222-209 తేడాతో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. ఆ తర్వాత అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంతకం కోసం బిల్లును పంపారు. కాంగ్రెస్ ఆమోదించిన రెండు గంటల తర్వాత ఓవల్ ఆఫీస్‌లో ట్రంప్ సంతకం చేసే కార్యక్రమం జరిగింది. ట్రంప్ సంతకంతో ఫెడరల్ ఉద్యోగులు గురువారం (అమెరికా కాలమానం ప్రకారం) నుంచే తిరిగి తమ పనిలో చేరే అవకాశం ఉంది. ఈ బిల్లును ఇప్పటికే సెనెట్ ఆమోదించిన విషయం విదితమే. అమెరికా దేశ చరిత్రలో ఈ షట్‌డౌన్ నిలిచిపోనున్నది. ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి అమెరికాలోని ఆర్థిక వృద్ధి, ఫెడరల్ సేవలు, ప్రజల జీవనంపై ఈ షట్‌డౌన్ తీవ్ర ప్రభావాన్నే చూపింది. సుమారు 14 లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులకు జీతాలు ఆలస్యమయ్యాయి. సప్లిమెంటల్ న్యూట్రిషన్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ (ఎస్ఎన్ఏపీ) వంటి ఆహార సహాయ పథకాలు 4.2 కోట్ల మంది అమెరికన్లకు ఆటంకాన్ని కలిగించాయి. కొన్ని అధికారిక అంచనాల ప్రకారం ఈ షట్‌డౌన్ ఆర్థిక వృద్ధిని రెండు శాతం తగ్గించింది. మూడు బిలియన్ డాలర్ల నష్టాన్ని కలిగించిందని అంచనా. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వంటి కీలక సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. వ్యాపారాలకు అంతరాయం ఏర్పడింది. ఇది అక్కడి ప్రజలలో తీవ్ర అసంతృప్తిని కలిగించింది.

# అల్ ఫలా యూనివర్సిటీ సభ్యత్వం రద్దు

## వర్శిటీలో కొనసాగుతున్న సోదాలు




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు ఘటనపై విచారణ జరుపుతున్న దర్యాప్తు సంస్థలు ప్రస్తుతం హర్యానాలోని 'అల్ - ఫలా విశ్వవిద్యాలయం'పై దృష్టిని కేంద్రీకరించిచాయి. ఈ విశ్వవిద్యాలయంలో దర్యాప్తు సంస్థలు సోదాలు నిర్వహించాయి. పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో భారత విశ్వ విద్యాలయాల సంఘం (ఎఐయు).. 'ఆల్ ఫలా' వర్సిటీకి సభత్యాన్ని రద్దు చేసింది. ఈ మేరకు గురువారం నాడు ఎఐయు ఒక ప్రకటన విడుదల చేసింది. మరోవైపు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్(న్యాక్) కూడా అల్ ఫలా వర్సిటీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆ విద్యాసంస్థ వెబ్‌సైట్‌లో గుర్తింపు గురించి తప్పుడు సమాచారం ప్రచురించినందుకుగానూ ఈ నోటీసులు ఇచ్చినట్లు తెలిపింది. 'అల్-ఫలా వైద్య కళాశాల న్యాక్ గుర్తింపు పొందకుండానే తన వెబ్‌సైట్ గుర్తింపు ఉందని బహిరంగా ప్రదర్శించింది. కనీసం అక్రిడేషన్ కోసం దరఖాస్తు కూడా చేసుకోలేదు. ఇది పూర్తిగా తప్పు. ప్రజలను, ముఖ్యంగా తల్లిదండ్రులు, విద్యార్థులను తప్పుదారి పట్టించడమే అవుతుంది' అని నోటీసుల్లో పేర్కొంది. అల్ ఫలా యూనివర్సిటీలో దర్యాప్తు అధికారుల తనిఖీల్లో అనేక సంచలన విషయాలు వెలుగుచూసినట్లు జాతీయ మీడియా తన కథనాల్లో పేర్కొంది. ఆ కథనాల ప్రకారం..అక్కడి మెడికల్ కాలేజీలోని బాయ్స్ హాస్టల్ ఉండే 17వ నంబరు భవనం ఉగ్ర కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్నట్లు తనిఖీల్లో గుర్తించారు. ఇందులో ఇప్పటికే అరెస్టైన మరో డాక్టర్ ముజమ్మిల్‌కు చెందిన 13వ నంబరు గదిలోనే ఉగ్రకుట్రలకు పథక రచన చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. యూనివర్సిటీ ల్యాబ్ నుంచి కొన్ని రసాయనాలను ఉమర్, ముజమ్మిల్ సేకరించినట్లు తెలిసింది. ఈ గదిలో సోదాలు జరిపిన పోలీసులు కొన్ని కెమికల్స్, డిజిటల్ పరికరాలు, పెన్‌డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు. అటు ముజమ్మిల్‌తో పాటు ఉమర్‌కు చెందిన 4వ నంబరు గదిలో సోదాలు చేసిన అధికారులు మూడు డైరీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ డైరీలను పరిశీలించిన దర్యాప్తు అధికారులు దేశంలోని నాలుగు ప్రాంతాల్లో వరుస పేలుళ్లకు వీరు ప్రణాళికలు చేసినట్లు గుర్తించారు. 4 నగరాల్లో ఇద్దరు చొప్పున మొత్తం 8 మంది పేలుళ్లకు కుట్ర పన్నినట్లు తెలిపారు. ఈ ఎనిమిది మందిలో ఉమర్, ముజమ్మిల్‌తో పాటు డాక్టర్ అదిల్, డాక్టర్ షాహీన్ కూడా ఉన్నట్లు తెలిపారు. ఈ కుట్రను అమలుచేసే బాధ్యతను ప్రధానంగా ఉమర్‌కు అప్పగించినట్లు సమాచారం. ఇందుకోసం నిందితులు దాదాపు 26 లక్షల వరకు నిధులు సేకరించి ఆ మొత్తాన్ని ఉమర్‌కు ఇచ్చినట్లు దర్యాప్తు వర్గాలు పేర్కొన్నాయి. ఇందులో రూ.3 లక్షల విలువైన 20 క్వింటాళ్లకుపైగా ఎన్?పీకే ఫెర్టిలైజర్‌ను గురుగ్రామ్, నూ%ఎ% తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసినట్లు గుర్తించాయి. ఎర్రకోట సమీపంలో పేలుడుతో సంబంధమున్న అల్ ఫలా యూనివర్సిటీకి చెందిన ముగ్గురు డాక్టర్లు స్విస్ కమ్యూనికేషన్ యాప్ త్రిమా ద్వారా నిరంతరంగా సంబంధాలను కలిగివున్నారని పోలీసులు గురువారం తెలిపారు. అనుమానితులైన ఆ ముగ్గురు డాక్టర్లు ఉమర్ ఉన్ నబి, ముజామ్మిల్ గనాయి, షాహీన్ షాహిద్‌లు ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌ను ఉపయోగించారని, దాని ద్వారానే మ్యాప్‌లను షేర్ చేసుకోవడం, తమ ఉగ్ర కుట్ర కార్యకలాపాలు, ప్రణాళిక, సమన్వయం అంతా చూసుకున్నారని పోలీసులు తెలిపారు. ఈ నెల 10న సాయంత్రం పేలుడు జరిగిన ఎరుపు రంగు ఎకో స్పోర్ట్ కారును ఉమర్ దాని బృందం అమ్మోనియం నైట్రేట్‌ను రవాణా చేయడానికి ఉపయోగించారని కూడా దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. హర్యానాలో రిజిస్టర్ అయిన అనుమానాస్పదమైన మారుతి బ్రెజా కారు అల్ ఫలా యూనివర్సిటీ పార్కింగ్ ప్రదేశంలో కనిపించిందని పోలీసులు గురువారం చెప్పారు. యూనివర్సిటీ ఆవరణలో వున్న అనేక వాహనాలను కూడా తనిఖీ చేస్తున్నామని, ఆ వాహనాలకు యజమానులు ఎవరనే విషయమై కూడా సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. ఈ దర్యాప్తునకు సంబంధించే కాన్పూర్‌కు చెందిన వైద్య విద్యార్థిని ఒకరిని యుపి తీవ్రవాద నిరోధక బృందం అదుపులోకి తీసుకుంది. కాగా ఈ నెల 10న జరిగిన పేలుళ్లలో తీవ్రంగా గాయపడిన ఒక వ్యక్తి గురువారం మరణించడంతో మృతుల సంఖ్య 13కి పెరిగిందని పోలీసులు తెలిపారు.




## కోల్‌కతా టెస్టులో ముగిసిన తొలి రోజు ఆట...

# టీమిండియాదే పైచేయి



కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో మొదటి రోజే భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా ఐదు వికెట్లతో చెలరేగడంతో సఫారీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 159 పరుగులకే కుప్పకూలింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన టీమిండియా, తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టానికి 37 పరుగులు చేసింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు ఆదిలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో సఫారీ బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. బుమ్రా (5/27) తన అద్భుతమైన బౌలింగ్‌తో దక్షిణాఫ్రికా పతనాన్ని శాసించాడు. అతనికి తోడుగా మహమ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

సఫారీ జట్టులో ఐడెన్ మార్క్రమ్ (31) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్‌కు కూడా ఆదిలోనే షాక్ తగిలింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (12) మార్కో యన్సెన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్‌తో కలిసి కేఎల్ రాహుల్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడాడు. ఆట ముగిసే సమయానికి రాహుల్ (13), సుందర్ (6) పరుగులతో క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం భారత్ 122 పరుగులు వెనుకంజలో ఉంది. రెండో రోజు భారత బ్యాటర్లు రాణిస్తే మ్యాచ్‌పై పూర్తిగా పట్టు సాధించే అవకాశం ఉంది.

## ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్

# ఒకేరోజు మూడు స్వర్ణ పతకాలు



ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో వెన్నం జ్యోతి సురేఖతో పాటు మిగిలిన ఆర్చర్లూ సత్తా చాటారు. దీంతో ఒకేరోజు భారత్‌కు మూడు స్వర్ణాలతో సహా మొత్తం నాలుగు పతకాలు దక్కాయి. జ్యోతి సురేఖ మహిళల వ్యక్తిగత విభాగంతో పాటు టీం విభాగాంలోనూ బంగారు పతకం సాధించగా.. మిక్స్‌డ్ విభాగంలో రజత పతకం సాధించడం కీలకపాత్ర పోషించింది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో 149-143పాయింట్ల తేడాతో తైపీ ఆర్చర్‌ను ఓడించింది. అంతకుముందు జరిగిన సెమీఫైనల్లో ప్రతికా ప్రదీప్‌పై 147-145పాయింట్ల తేడాతో చిత్తుచేసి ఫైనల్‌కు చేరింది. ఇక మహిళల కాంపౌండ్ టీం విభాగంలో జ్యోతి సురేఖ, ప్రతిక, దీప్‌క్షికలతో కూడిన భారతజట్టు 236-234 పాయింట్ల తేడాతో కొరియా జట్టును ఓడించి బంగారు పతకాన్ని ముద్దాడారు. తొలిరౌండ్‌లోనే భారత ఆర్చర్లు ఏకంగా 59పాయింట్లు సాధించి కొరియాకు ముచ్చెమటలు పట్టించారు. ఇక మిక్స్‌డ్ విభాగంలో వర్మ, ప్రథమేశ్, సాహిల్ జాదవ్‌లతో కూడిన భారతజట్టు స్వర్ణ పతక పోటీలో 229-230పాయింట్ల తేడాతో కజకిస్తాన్ చేతిలో ఓటమిపాలైంది.




## డిసెంబర్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న

# 'అవతార్ 3'

హాలీవుడ్ సంచలన దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టిస్తున్న దృశ్య కావ్యం 'అవతార్' సిరీస్‌కు సంబంధించి ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ ఫ్రాంచైజీలో మూడో భాగంగా రానున్న 'అవతార్: ఫైర్ అండ్ ఆష్' సినిమా రన్‌టైమ్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రం ఏకంగా 3 గంటల 15 నిమిషాల (195 నిమిషాలు) నిడివితో రానుండటం విశేషం. దీంతో 'అవతార్' సిరీస్‌లోనే ఇది అత్యంత అధిక నిడివి గల చిత్రంగా రికార్డు సృష్టించనుంది.



గతంలో వచ్చిన 'అవతార్' (2009) మొదటి భాగం 2 గంటల 58 నిమిషాలు ఉండగా, రెండో భాగం 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' 3 గంటల 12 నిమిషాల నిడివితో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు మూడో భాగం అంతకుమించిన నిడివితో రాబోతోంది. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 2025 డిసెంబర్ 19న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పండోరా గ్రహం నేపథ్యంలో సాగే ఈ కథలో ఈసారి ఓ కొత్త విలన్‌ను పరిచయం చేయబోతున్నారు. 'వరాంగ్' అనే ఈ పాత్రలో నటి ఊనా చాప్లిన్ కనిపించనుంది. పండోరా జీవధార అయిన ఐవాను వ్యతిరేకించే తొలి నావి పాత్ర ఇదే కావడం కథలో కీలక మలుపు కానుంది. ఈ సినిమా గురించి దర్శకుడు జేమ్స్ కామెరూన్ మాట్లాడుతూ.. "గత భాగాలతో పోలిస్తే ఇది మరింత ఉత్కంఠభరితంగా, భావోద్వేగభరితంగా, భారీ స్థాయిలో ఉంటుంది" అని తెలిపారు. సామ్ వర్తింగ్టన్, జోయ్ సల్దానా, సిగోర్నీ వీవర్, కేట్ విన్‌స్లెట్ వంటి పాత తారాగణంతో పాటు కొత్తగా ఊనా చాప్లిన్ కూడా ఈ చిత్రంలో భాగమయ్యారు. అవతార్ సిరీస్‌ను మొత్తం ఐదు భాగాలుగా ప్లాన్ చేసిన విషయం తెలిసిందే. మూడో భాగం తర్వాత, నాలుగో భాగాన్ని 2029లో, ఐదో భాగాన్ని 2031 డిసెంబర్‌లో విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 'అవతార్' మొదటి భాగం ప్రపంచంలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా చరిత్ర సృష్టించగా, రెండో భాగం మూడో స్థానంలో నిలిచింది. ఇదిలా ఉండగా, 'అవతార్ 3' సినిమాతో పాటే మార్వెల్ స్టూడియోస్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'అవెంజర్స్: డూమ్స్‌డే' ట్రైలర్‌ను థియేటర్లలో ప్రదర్శించనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ వార్త నిజమైతే మార్వెల్, అవతార్ అభిమానులకు డబుల్ ట్రీట్ ఖాయం.

## అట్లీ సొంత బ్యానర్లో 'జైభీమ్' హీరోయిన్

# లిజోమోల్ జోస్

ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి సరసన 'జై భీమ్' హీరోయిన్ లిజోమోల్ జోస్ నటించనున్నారు. బాలాజీ ధరణీధరన్ దర్శకత్వంలో రూపొందే ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే చెన్నైలో జరుగుతోంది. ఈ నేపథ్యంలో హీరోయిన్‌గా మలయాళ భామ లిజోమోల్‌ను ఎంపిక చేశారు. దర్శకుడు అట్లీ తన సొంత నిర్మాణ సంస్థపై తెరకెక్కిస్తున్నారు.

'నడువుల కొంజెం పక్కత్త కాణోం', 'సీతక్కాది' వంటి చిత్రాల తర్వాత విజయ్ సేతుపతి – దర్శకుడు బాలాజీ కాంబోలో రానున్న మూడో చిత్రం. టాలీవుడ్ దర్శకుడు పూరి జగన్నాథ్ చిత్రాన్ని పూర్తి చేసిన తర్వాత విజయ్ సేతుపతి ఈ ప్రాజెక్టులో పాలుపంచుకోనున్నారు. ఈ మూవీకి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెల్లడి కానుంది.



# రిస్క్ ఉన్న పాత్రలకే ప్రాధాన్యత: అదాశర్మ



ఈ విషయంపై అదా శర్మ మాట్లాడుతూ, "రిస్క్‌తో కూడిన పాత్రలు చేసినప్పుడే కెరీర్‌కు విలువ వస్తుంది. నేను '1920' సినిమాతో పరిశ్రమలోకి వచ్చాను. నా తొలి చిత్రమే ఒక పెద్ద సాహసం. 'ది కేరళ స్టోరీ' వచ్చే వరకు మంచి స్క్రిప్ట్ కోసం ఎదురు చూశాను. ఆ చిత్రం తర్వాత నా కెరీర్ పూర్తిగా మారిపోయింది. దాని తర్వాత నేను నటించిన 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' చిత్రాల సమయంలోనూ తీవ్రమైన బెదిరింపులు ఎదుర్కొన్నాను. దేశంలో సగం మంది నన్ను చంపాలని కోరుకుంటే, మిగతా సగం మంది నాపై ప్రశంసలు కురిపిస్తూ నన్ను రక్షించారు" అని అన్నారు.తన స్క్రిప్ట్ ఎంపిక గురించి వివరిస్తూ, సవాలుతో కూడిన పాత్రలనే తాను ఇష్టపడతానని అదా స్పష్టం చేశారు. "పాత్రలో భావోద్వేగం, యాక్షన్ సన్నివేశాలు తప్పనిసరిగా ఉండాలి. నా పాత్రలో ఎమోషనల్ టచ్ ఉండి, అది చూసి నా కుటుంబం కాస్త ఆందోళన చెందాలి. అలాంటి అంశాలు లేకపోతే ఆ పాత్ర ఎందుకు చేయాలనిపిస్తుంది" అని ఆమె తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. మొత్తంగా, కెరీర్‌లో రిస్క్ తీసుకోవడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని అదా శర్మ పేర్కొన్నారు.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**